## పాకిస్తాన్ తో కీలక మ్యాచ్ కోసం
# టీమిండియా కసరత్తు


7


మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

15.2.2026
ఆదివారం Sunday
సంపుటి (Volume): 10
సంచిక (Issue) : 297
పేజీలు : 8
Pages : 8
వెల : 2
Published from : Karimnagar



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్




## విచారించండి

ఫార్ములా ఈ రేస్‌లో
కీలక పరిణామం..
ప్రాసిక్యూషన్‌కు
కేంద్రం గ్రీన్ సిగ్నల్
అర్వింద్ కుమార్ ను
విచారణకు పిలుపు

.. వివరాలు 2లో



## స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం

పోలీసుల మెరుపు
దాడిలో 45మంది అరెస్ట్

.. వివరాలు 2లో



## రైతుభరోసా విడుదలకు రంగం సిద్ధం

ఫిబ్రవరి 17 తేదీని
ముహూర్తంగా నిర్ణయం

.. వివరాలు 2లో



## మున్సిపాలిటీలను ఆదర్శంగా
# తీర్చిదిద్దుదాం

### మున్సిపల్ ఫలితాలపై పార్టీ నేతలతో సీఎం రేవంత్

గెలిపించిన సీనియర్
మంత్రులకు అభినందనలు
భద్రాద్రి కొత్తగూడెంపై
కుదిరిన అవగాహన
మేయర్ సిపిఐకి, డిప్యూటి
మేయర్ కాంగ్రెస్‌కు
సీఎం రేవంత్‌తో పల్లా
వెంకట్‌రెడ్డి భేటీలో నిర్ణయం

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. మనపట్ల ప్రజల నమ్మకం పెరిగేలా అభివృద్ది సాగాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు.

**జనతా న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ చేయడమే కాకుండా.. నిజామాబాద్, కొత్తగూడెం కార్పొరేషన్లలో మేయర్ పీఠాలను కైవసం చేసుకునే వ్యూహాలపై దిశానిర్దేశర చేశారు. మంచి ఫలితాలు సాధించారని మంత్రులు, సీనియర్ నేతలను అభినందించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ

మిగతా 2 లో


02

## తెలంగాణలో మారుతున్న సమీకరణాలు

హంగ్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ నజర్
కనీసం 20 కైవసం చేసుకునేలా కసరత్తు
మంత్రులు, పార్టీ నేతలతో సీఎం రేవంత్ సమీక్ష
ఆయారామ్ గయారామ్ ల హడావిడి
సీఎం రేవంత్‌తో భేటీ అయిన వడ్డేపల్లి కౌన్సిలర్లు

## మున్సిపల్ ఫలితాల ప్రభావం
# అసెంబ్లీపై ఉండదు

ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే
అయినా గణనీయంగా తమ బలాన్ని పెంచుకున్నాం
మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు.


03

## మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు



కాంగ్రెస్ అక్రమాలతో గెలుపు
మాజీమంత్రి తలసాని శ్రీనివాస యాదవ్

## కరీంనగర్ మేయర్
# పీఠం బీజేపీదే



కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొడుతాం
ప్రజాతీర్పును కాలరాసేలా కుట్రలు
కేంద్రమంత్రి బండి సంజయ్

అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని భాజపాని మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని చూసినా.. ప్రజలు మాత్రం తమని ఆశీర్వదించారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.



## దేశ భద్రతను కాంగ్రెస్ ప్రమాదంలో పడేస్తుంది

ఈశాన్య ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తున్నాం!
అసోంకు కీలకం కానున్న రాబోయే ఐదేళ్లు
ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు


3

జాతీయ రహదారిపై విమాన
### ల్యాండింగ్ సౌకర్యం
అసోంలో ల్యాండ్ అయిన మోదీ విమానం

## ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు

మోదీ ప్రభుత్వం వాళ్ల ఇంటికెళ్లి కొట్టింది
కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శలు

.. వివరాలు 3లో



## అమెరికా ఒప్పందంతో రైతులకు తీవ్ర నష్టం

వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారు
ఒప్పందంపై భ్రమలు కల్పిస్తున్న ప్రధాని మోదీ
కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

.. వివరాలు 3లో


3

## రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు
# కేబినేట్ ఆమోదం

అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణం
ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శనివారం జరగిన కేంద్ర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ.1,60,504 కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది.

## తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

గూడె బెల్లూరు - మహబూబ్‌నగర్ నాలుగు లైన్ల రోడ్డు
3,175 కోట్ల ఖర్చుతో నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం


2

# తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

**గూడె బేల్లూరు - మహబూబ్‌నగర్ నాలుగు లైన్ల రోడ్డు**

**3,175 కోట్ల ఖర్చుతో నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి14 :** కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగానే కర్ణాటకలోని గూడె బేల్లూరు- తెలంగాణలోని మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ. 3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జాతీర రహదారి 167 కింద సుమారు 80 కి.మీ మేర ఈ రోడ్డు నిర్మాణం కానుంది. రాయచూర్, నారాయణపేట, దేవరకద్ర, మహబూబ్ నగర్ మీదుగా హైదరాబాద్‌కు ఉన్న ఈ కనెక్టివిటీకి ఈ కొత్త నాలుగు లైన్‌ల హైవేను అటాచ్ చేస్తూ నిర్మాణం చేపట్టనున్నారు.దీంతో పాటు హైదరాబాదు పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సైతం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దమాసియా బిటాడ నర్సాపూర్మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి 4,584 కోట్ల రూపాయలను ఖర్చు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే గోతి- త్రిమ్బక్ -- పాల్గర్ సెక్షన్ అబ్రిడేషన్ కోసం 3320 కోట్ల రూపాయలు కేంద్రం ఖర్చు చేయనుంది. అలాగే రూ. 2,254 కోట్లతో నోయిడా మెట్రో ఆక్వా లైన్ 11.6 కిమి పొడిగింపుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నోయిడా బొటానికల్ గార్డెన్ నుంచి నోయిడా సెక్టార్ 142 వరకు మెట్రో లైన్ పొడిగింపునకు నిర్ణయం తీసుకుంది. నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. అలాగే రూ. లక్ష కోట్లతో అర్బన్ చాలెంజ్ ఫండ్ కి కేబినెట్ ఆమోదం తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రాష్ట్రాలకు రుణసాయం చేయాలని నిర్ణయించింది. స్టార్టప్ ఇండియా ఫండ్ 2.0 కి 10 వేల కోట్ల కేటాయింపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత 13.3 లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేంద్ర ఆమోదం తెలిపింది. 2024 లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 1,89,601 కోట్లతో 49 రైల్వే ప్రాజెక్టులకు , రూ. 2,48,053 కోట్లతో 24 జాతీయ రహదారుల ప్రాజెక్టులును కేంద్రం చేపట్టింది. అలాగే రూ. 1,15,406 కోట్లతో 9 మెట్రో ప్రాజెక్టులు, రూ. 7,339 కోట్లతో నాలుగు నూతన ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం నిర్ణయం తీసుకుంది.రూ. 1,45,945 కోట్లతో పోర్టు నిర్మాణానికి, రూ. 6,811 కోట్లతో రెండు రోప్ వే ప్రాజెక్టుల నిర్మాణాన్ని కేంద్రం చేపట్టింది. అలాగే 3 హైడ్రో ప్రాజెక్టులకు గాను బడ్జెట్‌లో రూ. 28,432 కోట్ల నిధులను కేటాయించింది. అంతేకాకుండా రూ. 28,602 కోట్లతో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు అమోదం తెలిపింది. పీఎం ఆవాస్ యోజనకు కింద రూ. 5,36,137 కోట్లు కేటాయింపు చేసింది.

# విచారించండి



**ఫార్ములా ఈ రేస్ లో కీలక పరిణామం..**

**ప్రాసిక్యూషన్ కు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

**అర్వింద్ కుమార్ ను విచారణకు పిలుపు**

**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటి వరకు ఫోన్ ట్యాపింగ్, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలతో తెలంగాణలో రాజకీయాలు హీటెక్కిన విషయం తెలిసిందే. ఫార్ములా ఈ రేసింగ్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుంది. ఇప్పటికే దీనిలో కేటీఆర్ ను పలు మార్లు అధికారులు విచారించారు. తాజాగా.. ఈ కేసులో ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ను విచారించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫార్మూల్ ఈ రేసింగ్ లో భారీగా డబ్బులు అడ్డగోలుగా చేతులు మారాయని అవినీతి నిరోధక శాఖ గతంలోనే కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ని విచారణకు గతంలోనే తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతిని ఇచ్చారు. తాజాగా సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్ విషయంలో కేంద్రం అనుమతి ఇచ్చింది. దీంతో ఏసీబీ ఆయనపై కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు సమాయత్తం అవుతుంది. ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 , ఏ5గా ఎఫ్ఈవో ప్రతినిధులు ఉన్నారని తుది నివేదికలో స్పష్టం చేసింది. క్విడ్ ప్రొ కో జరిగిందని అధికారులు ఆరోపణలు చేశారు. ట్రైపార్టీ అగ్రిమెంట్ కు ముందే బీఆర్ఎస్ కు ఈ బాండ్లు చెల్లించారని ఏసీబీ ఆరోపించింది. కేటీఆర్ సైతం ఇప్పటికే ఫార్ములా ఈ అనే అంశాన్ని ప్రభుత్వం తెర మీదికి తీసుకొస్తున్నారు. ఇప్పటికే నాలుగు సార్లు పిలిచి వాళ్లు చేసింది ఏమీ లేదన్నారు. కేవలం మరోసారి వేధింపులలో భాగంగా పిలవబోతున్నారన్న సమాచారం ఉందన్నారు. ఎన్ని సార్లు పిలిచినా భయపడేది లేదని, సత్యమే చెప్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం

**పోలీసుల మెరుపు దాడిలో 45మంది అరెస్ట్**

**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ పరిధిలో స్పా సెంటర్ల పేరుతో సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని గాయత్రి రెసిడెన్సీలో ఉన్న 'ఆసన వెల్నెస్ స్పా' సెంటర్‌లో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం జరుగుతుందన్న పక్కా సమాచారంతో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పోలీసులు మొత్తం 15 మంది యువతులను, 30 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు నిర్వాహకులు కాగా, మిగిలిన 27 మందిని విటులుగా గుర్తించి అందరిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల విచారణలో ఈ దందాకు సంబంధించిన షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇర్ఫాన్ అనే వ్యక్తి గత ఏడాది కాలంగా ఈ స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఫుల్ బాడీ మసాజ్, అరోమా మసాజ్ వంటి పేర్లతో కస్టమర్లను ఆకర్షించి, లోపల నిబంధనలకు విరుద్ధంగా క్రాస్ మసాజ్ , వ్యభిచార కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తేలింది. ఈ ముఠాకు కూకట్‌పల్లి 9వ ఫేజ్‌లో కూడా మరో బ్రాంచ్ ఉన్నట్లు సమాచారం అందడంతో, పోలీసులు ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఈ రైడ్ సందర్భంగా నిందితుల నుంచి పోలీసులు 45 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్పా సెంటర్ల ముసుగులో ఇలాంటి అసాంఘిక పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పట్టుబడ్డ యువతులను రెస్క్యూ హోమ్‌కు తరలించగా, నిర్వాహకులు , విటులపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. నగరంలో ఇలాంటి అక్రమ సెంటర్ల జాబితాను తయారు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు.

# రైతుభరోసా విడుదలకు రంగం సిద్ధం



**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు శుభవార్త చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల పక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా నిర్ణయం చేసినట్లు తెలుస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సిఎం రేవతం చర్చించే అవకాశం ఉంది. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

మొదటి పేజీ తరువాయి



మరింత ముందుకెళ్లాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఫలితాలను బేరీజు వేసుకుని మరింతగా పార్టీని పటిష్టం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. హంగ్ అసెంబ్లీలు ఉన్నచోట వాటిని దక్కించుకునేలా వ్యూహాత్మకంగా కదలాలని అన్నారు. ఇందులో మంత్రులు, పిసిసి చీఫ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంచి ఫలితాలు వచ్చినా, నిజామాబాద్, కొత్తగూడెంలలో మేయర్ పదవులను దక్కించుకోవడంపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. నిజామాబాద్‌లో మేయర్ పీఠం దక్కించుకునేందుకు ఎంఐఎం పార్టీతో చర్చలు జరపాలని పీసీసీ చీఫ్‌కు సీఎం రేవంత్ సూచించారు. కొత్తగూడెంలో స్వతంత్ర అభ్యర్థులు, ఇతర చిన్న పార్టీల మద్దతు కూడగట్టి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై మంత్రులను, కార్యకర్తలను అభినందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను మా ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి చూపించింది. మా సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకున్న నమ్మకమే ఈ విజయానికి పునాది' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రులందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ స్థాయిలో ఫలితాలు వచ్చాయని ఆయన కొనియాడారు. ఎన్నికల విజయం కేవలం ఆరంభం మాత్రమేనని, అసలైన అభివృద్ధి ఇప్పుడే మొదలవ్వాలని మంత్రులకు సీఎం సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు, మంత్రులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను, సంక్షేమ ఫలాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికలనూ ఎదుర్కోవాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఇదిలావుంటే సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తాజా పరిణామాలు, కొత్తగూడెం కార్పొరేషన్ గురించి చర్చించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ కూటమి (కాంగ్రెస్-22, సీపీఎం-1) 23 డివిజన్లలో విజయం సాధించింది. సీపీఐకి 22, బీఆర్ఎస్-8, భాజపా-1, స్వతంత్రులు 6 డివిజన్లలో గెలుపొందారు. స్వతంత్రుల్లో ఒకరు సీపీఐ నాయకుడు కావటంతో ఆ పార్టీ బలం కూడా 23కు చేరింది. మిగిలిన ఐదుగురు స్వతంత్రుల్లో ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారిలో ముగ్గురు హస్తం గూటికి చేరటంతో కాంగ్రెస్ కూటమి బలం 29కు పెరిగింది. అయితే భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఉత్కంఠ వీడింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి సమావేశం కావడంతో ఉత్కంఠకు తెరపడింది. కొత్తగూడెం కార్పొరేషన్ అంశంపై చర్చించిన నేతలిద్దరూ ఓ అంగీకారానికి వచ్చారు. మేయర్ పోస్ట్ సీపీఐకి, డిప్యూటీ మేయర్ పోస్ట్ కాంగ్రెస్ పార్టీకి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో కొత్తగూడెం కార్పొరేషన్ అంశం ఓ కొలిక్కి వచ్చింది. కాగా, ఈ కార్పొరేషన్‌లోని 60 డివిజన్లకు ఈనెల 11న ఎన్నికలు జరగ్గా.. 13న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆర్ఎస్ 8, సీపీఎం 1, బీజేపీ 1, స్వతంత్రులు 6 స్థానాల్లో జయకేతనం ఎగురవేశారు. మరోవైపు కొత్తగూడెం కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ 8 డివిజన్లను సొంతం చేసుకుంది. అయితే, వారంతా కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరిగింది. దీనిపై ఆ 8మంది కార్పొరేటర్లు స్పందించారు. మేయర్ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం చెప్పిందే తమకు శిరోధార్యమంటూ తేల్చి చెప్పారు. పార్టీ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు అమ్ముడు పోయారంటూ చేసే ప్రచారం అవాస్తమంటూ వీడియో విడుదల చేశారు.

# తెలంగాణలో మారుతున్న సమీకరణాలు

**హంగ్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ నజర్**

**కనీసం 20 కైవసం చేసుకునేలా కసరత్తు**

**మంత్రులు, పార్టీ నేతలతో సిఎం రేవంత్ సమీక్ష**

**ఆయారామ్ గయారామ్ ల హడావిడి**

**సీఎం రేవంత్‌తో భేటీ అయిన వడ్డేపల్లి కౌన్సిలర్లు**

**హైదరాబాద్,ఫిబ్రవరి14:** మున్సిపల్ ఎన్నికల ఫలితాల తరవాత సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మరోవైపు ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నికపై అనుసరించాల్సిన వ్యూహంపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ప్రధానంగా రాష్ట్రంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లోని సిఎం క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు.. తదుపరి కార్యాచరణపై చర్చించారని సమాచారం. ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చ జరగనుంది. వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలు 'హస్త'గతం అవుతాయని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ సమావేశానికి పలువురు సీనియర్ నేతలూ హాజరయ్యారు. ఇకపోతే తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎన్నికల్లో గెలిచిన పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమకు నచ్చిన పార్టీల్లో చేరుతున్నారు. ఇంద్రేశం మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ లావణ్య, ఇస్నాపూర్ 10వ వార్డు కౌన్సిలర్ రాహుల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. మరోవైపు నారాయణపేట పదో వార్డు స్వతంత్ర కౌన్సిలర్ జయశ్రీ భాజపాలో చేరారు. హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సమక్షంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. నారాయణపేటలో మొత్తం 24 స్థానాలకు భాజపా 11 స్థానాలు గెలుచుకుంది. స్వతంత్ర అభ్యర్థి చేరికతో భాజపా సభ్యుల సంఖ్య 12కి చేరింది. దీంతో నారాయణపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికలో ఎక్స్ అఫిషియో ఓటు కీలకం కానుంది. ఇప్పటికే బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, భాజపాకు చెందిన ఒక కౌన్సిలర్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ మొత్తం 34 స్థానాలు ఉండగా.. కాంగ్రెస్‌కు 14, బీఆర్ఎస్‌కు 14, స్వతంత్రులకు 5, భాజపాకు 1 స్థానం దక్కాయి. దీంతో ఆ పార్టీ బలం 17కు చేరింది. ఈ నెల 16న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. మరోవైపు జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కౌన్సిలర్లు కుర్వ పావని, శారద, మంజుల, యుగేందర్‌రెడ్డి, దేవమ్మ, విజయ్‌భాస్కర్, జయశ్రీ, తిమ్మప్ప నగరానికి చేరుకొని సీఎంతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తాము కాంగ్రెస్ పార్టీలో చేరట్లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే సీఎంను కలిసినట్లు చెప్పారు. తెలంగాణ జాగృతి పార్వర్డ్ బ్లాక్ ద్వారా పోటీ చేసింది. అయితే అభివృద్ధికి సహకరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# మేయర్ పదవిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోం



**ఇది తమకు వచ్చిన గొప్ప అవకాశం**

**ఎవరైనా మాకు మద్దతు ఇస్తే స్వాగతిస్తాం**

**కేటీఆర్ స్వయంగా ఫోన్ చేసి మద్దతు తెలిపారు**

**సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడి**

**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారింది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీపీఐకి బేషరతుగా మద్దతు ప్రకటించడం రాజకీయంగా సంచలనంగా మారింది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐ అత్యధిక స్థానాలు గెలుచుకున్న నేపథ్యంలో, తాము మద్దతు ఇస్తామని కేటీఆర్ స్వయంగా ఫోన్ చేసి తెలిపారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. మీరు గెలిచారు కాబట్టి మీకు మద్దతు ఇస్తాం అని కేటీఆర్ చెప్పినట్లు ఆయన ధృవీకరించారు. కూనంనేని మాట్లాడుతూ.. మేయర్ పదవిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమన్నారు. ఇది తమకు వచ్చిన గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ఎవరైనా మద్దతు ఇస్తే స్వాగతిస్తామని చెప్పారు. ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని, మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌తో పాటు పలువురు ఇండిపెండెంట్లు కూడా మద్దతు ఇస్తామని ముందుకు వచ్చినట్లు తెలిపారు. అయితే పొత్తుల విషయంలో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశంపై మరో రెండు రోజుల్లో పార్టీ అంతర్గత సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని కూనంనేని తెలిపారు.

# సిపిఐ నేత గిరిప్రసాద్ సతీమణి కమలాదేవి మృతి

**సంతాపం ప్రకటించిన ఎమ్మెల్యే కూనంనేని**

**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** సీపీఐ అగ్ర నాయకులు, కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్ సతీమణి నల్లమల కమలాదేవి (87) ఇకలేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లో కన్నుమూశారు. కమలాదేవి భౌతిక కాయాన్ని బంధువులు, పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు సందర్శనార్థం జూబ్లీహిల్స్‌లోని ఆమె పెద్ద కుమార్తె నివాసంలో ఉంచనున్నారు. సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉంచి తరవాత సాయంత్రం 5-00 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నల్లమల కమలాదేవి మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు. నల్లమల కమలాదేవి తన భర్త గిరిప్రసాద్‌కు అనునిత్యం వెంట నడిచి ఆయన పోరాటంలో భాగస్వాములయ్యారని అన్నారు. వారి కుటుంబసభ్యులతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని అన్నారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# లాయర్ స్వప్న కేసులో నిందితుల అరెస్ట్

**హత్యకు ఉప యోగించిన కార్లు, ఫోన్లు స్వాధీనం**

**భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసుల వెల్లడి**

**రంగారెడ్డి,ఫిబ్రవరి14 :** మొయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో న్యాయవాది స్వప్న హత్య కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ గోటికె స్వప్న ఫిబ్రవరి 4న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. న్యాయవాది స్వప్న హత్యకు భూ వివాదమే కారణమని నిర్ధారించారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులలో ప్రధాన నిందితుడు స్వప్న సొంత అన్న గోటికె రాజు మరో ముగ్గురు సహచరులతో కలిసి హత్యకు కుట్ర చేసినట్లు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ యోగేష్ గౌతమ్ చెప్పారు. సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై వివాదం. భూమి సర్వే కోసం వెళ్లిన సమయంలో నిందితులు స్వప్నపై దాడికి పాల్పడ్డారు. మొదటగా కారుతో ఢీకొట్టి, తర్వాత రాళ్లు ,కర్రలతో దాడి చేసి అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేశారు. దీంతో ఘటన స్థలంలోనే స్వప్న మృతి చెందింది. హత్య అనంతరం ఇన్నోవా కార్, స్కూటీలో నిందితులు పరారయ్యారు. ఇన్నోవా కారు, స్కూటీ సీజ్ చేశారు. నలుగురు నిందితుల మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కొడవలిని కూడా సీజ్ చేశాం అని డీసీపీ యోగేష్ తెలిపారు.

చెల్లిని చంపిన సొంత అన్న కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే స్వప్న అన్న రాజుతో పాటు ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్వప్న లొకేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ రెండు సార్లు స్వప్నను హత్య చేసేందుకు ప్రయత్నించినట్టు రాజు విచారణలో ఒప్పుకున్నాడు. ఒకసారి కారుతో మరోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీ కొట్టించే ప్రయత్నం చేశాడు రాజు. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్లాన్ చేశాడు. రెండు ఘటనల నుంచి స్వప్న తప్పించుకుంది. సీసీ కెమెరాలు లేని ప్రదేశాలు చూసి స్వప్నను వెనుక నుంచి ఢీ కొట్టేందుకు రాజు ప్లాన్ చేశాడు. ప్లాన్ సక్సెస్ చేసేందుకు తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. ఈ రోడ్డు ప్రమాదం కేసులను హత్యాయత్నం కేసులుగా పోలీసులు మార్చనున్నారు.

# కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే

## కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొడుతాం

## ప్రజాతీర్పును కాలరాసేలా కుట్రలు

## కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని భాజపాని మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని చూసినా.. ప్రజలు మాత్రం తమని ఆశీర్వదించారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. అత్యధిక స్థానాలు చేజెక్కించుకున్న తామే కరీంనగర్ మేయర్ పీఠం పక్కా ప్లాన్‌తో వ్యూహాత్మకంగా దక్కించుకోబోతున్నామని స్పష్టం చేశారు. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తే.. వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం బయట పెడతానని తేల్చి చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అనుసంధానకర్తగా ఎంఐఎం పనిచేస్తుందని ఆరోపించారు. కరీంనగర్‌లో కార్యకర్తల కష్టం, ప్రధాని మోదీ ఆశీస్సులతో గెలవడం సంతోషంగా ఉందని కేంద్రమంత్రి హర్షం వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు భాజపాలో చేరారని, మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశామని వెల్లడించారు. మున్సిపల్ పీఠం ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకూ రూ.1,400 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించినందుకు కరీంనగర్ ప్రజలకు బండి కృతజ్ఞతలు చెప్పారు. ఎంఐఎం రివైవల్ డే నిర్వహించడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. దేనికోసం రివైవల్ డే చేస్తున్నారని ప్రశ్నించారు. రజాకర్ల రాజ్యం తెస్తారా.. మహిళలను కించపరిచి బతుకమ్మ ఆడిస్తారా.. పాత రాజ్యం తెస్తామని ఎంఐఎం రివైవల్ డే చేస్తుందా? అని నిలదీశారు. వారి ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. ఎంఐఎం ప్రాబల్యం ప్రతి ఎన్నికల్లో తగ్గుతుందని, భాజపా బలపడుతూ వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో భాజపా జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. భాజపా అభ్యర్థుల విజయం పట్ల రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్

### నైతిక విజయం తమదే అన్న వేముల

**నిజామాబాద్,ఫిబ్రవరి14 :** మామున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి గెలిచిందని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో నైతిక విజయం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలదే అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలకు విరుద్ధంగా అధికార యంత్రాంగాన్ని దుర్వినయోగం చేశారని అన్నారు. రాత్రింబవళ్లు నోట్ల కట్టలు పంపిణీ చేశారని, మద్యాన్ని ఏరులై పారించారని ఆరోపించారు. కొన్నిచోట్ల రిగ్గింగ్ చేయడంవల్లే అక్కడ గెలిచారని తెలిపారు. అధికార బలాన్ని ఉపయోగించి ఎన్నికల్లో గెలిస్తే అది విజయం కాదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ తీరును గమనిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నప్పటికీ, ఆ పార్టీ సాంకేతికంగా విజయం సాధించిందే తప్ప నైతికంగా గెలిచింది బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగం చేస్తూ, మద్యం, డబ్బులు, చీర లు పంపిణీ చేసిందని, అన్ని అవాంతరాలను ఎదుర్కొని బీఆర్ఎస్ అభ్యర్థులు వీరోచితంగా పోటీలో నిలిచారన్నారు.ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడినా, గెలిచినా తాము ఎప్పటికీ ప్రజల పక్షమేనని ఎమ్మెల్యే అన్నారు. అధికార పార్టీ అభ్యర్థులకు బీఆర్ఎస్ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగం, మద్యం, డబ్బు పంపకాలతో కాంగ్రెస్ పార్టీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిందని ఆరోపించారు. అయినప్పటికీ మెజార్టీ సీట్లు సాధించలేకపోయిందని తెలిపారు.

## చక్రం తిప్పిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

### కామారెడ్డిలో హంగ్‌తో అస్పష్టత

**నిజామాబాద్,ఫిబ్రవరి14 :** టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సొంత మండలం భీంగల్‌లో చక్రం తిప్పారు. రెండు రోజుల ముందు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దీంతో ప్రజాపాలనకు జనం జైకొట్టారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి భీంగల్ మున్సిపాలిటీని సవాల్‌గా తీసుకున్నా సక్సెస్ కాలేకపోయారు. బీఆర్ఎస్ నాలుగు స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆర్మూర్ మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరేయడానికి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సర్వశక్తులు ఒడ్డినా 8 చోట్ల మాత్రమే గెలుపు సాధించగలిగారు. 19 స్థానాలు దక్కించుకొని కాంగ్రెస్ మ్యాజిక్ ఫిగర్ సొంతం చేసుకుంది. రెబెల్స్ పోటీలో లేకుంటే మరో మూడు వార్డులు కాంగ్రెస్ కు దక్కేవి. బీఆర్ఎస్ 5 స్థానాలు, మజ్లిస్ ఒక చోట గెలువగా ఇండిపెండెంట్‌లుగా పోటీ చేసిన ముగ్గురు రెబెల్స్ విజయం సాధించారు. 38 వార్డులున్న బోధన్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ 17 వార్డులు కైవసం చేసుకుంది. రెబెల్స్‌తో కొన్ని వార్డుల్లో పార్టీకి నష్టం వాటిల్లింది. మజ్లిస్ గత వైభవాన్ని చాటుతూ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 3 వార్డులకే పరిమితమైంది. బీఆర్?ఎస్? ఐదు వార్డులు గెలువగా కాంగ్రెస్ రెబెల్ ఒకచోట విజయం సాధించారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ వచ్చింది. బాన్సువాడలో 19 వార్డులకుగాను 11 , ఎల్లారెడ్డి వార్డులకు 10, బిచ్కుందలో 12 వార్డులకు 10 వార్డులను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కామారెడ్డి మున్సిపాలిటీల్లో ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. మ్యాజిక్ ఫిగర్ చేరుకునేందుకు ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. ఛైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఆయా పార్టీలకు ఇండిపెండెంట్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు కీలకం కానున్నారు.

# బీజేపీతో బీఆర్ఎస్ పొత్తులకు తెర

### తోకపార్టీలకే తోక పార్టీగా మారిన బీఆర్ఎస్

### సిపిఐకి మద్దతు ఇస్తామనడమే ఇందుకు నిదర్శనం

### మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, ఫిబ్రవరి 14 :** మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కంచుకోట ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ బలహీన పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆర్ఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తానంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆర్ఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. సీపీఐ అడగకుండానే.. కొత్తగూడెంలో సీపీఐకు కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇవ్వటం దిగజారుడే అని చెప్పుకొచ్చారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు ఎన్ని మాటలు అన్నారో కేటీఆర్‌కు గుర్తు లేదా అని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని ఆరోపణలను కేటీఆర్ ఒప్పుకున్నట్లేనా అని కవిత నిలదీశారు. కార్మికుల కోసం సీపీఐకు మద్దతు అంటోన్న కేటీఆర్ నయ వంచన చేసుకుంటున్నారని అన్నారు. అవసరం వచ్చినప్పుడు.. బీఆర్ఎస్‌కు కార్మికులు గుర్తొస్తారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని మున్సిపల్ ఫలితాలు చెప్తున్నాయన్నారు. మున్సిపాలిటీలను తీర్చిదిద్దానని చెప్పుకుంటోన్న కేటీఆర్.. ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ఈ స్థానాలు రావడమే ఎక్కువ అన్నట్లు కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. 'నేనే రాజు నేనే మంత్రి.. సీఎం పదవి ఆరు నెలలు బోనస్' అంటోన్న రేవంత్.. రైతుల బోనస్ గురించి మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు. జాగృతిపై కామెంట్స్ చేస్తోన్న వారికి చెప్తున్న.. ఇది జస్ట్ ట్రైలర్.. పిక్చర్ బాకీ హై' అని అన్నారు కవిత. కరీంనగర్ కార్పొరేషన్ కోసం బీజేపీ అష్టకష్టాలు పడుతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తప్ప బీజేపీ ఎక్కడా లేదన్నారు. సింగరేణి ఎన్నికల్లో కూడా ఏఐఎఫ్‌బీతో కలిసి జాగృతి పోటీ చేస్తుందని ప్రకటించారు. 40కి పైగా స్థానాల్లో జాగృతి, ఏఐఎఫ్‌బీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు కవిత. వడ్డేపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రలోభాలకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎవరికి మద్దతివ్వాలో స్థానిక జాగృతి నేతలు డిసైడ్ చేసుకుంటారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించి ప్రభుత్వ సొమ్ముతో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారని కవిత ఆరోపించారు. గతంలో 90 శాతం గెలిచిన బీఆర్ఎస్.. 17 సీట్లకు పడిపోవటం దారుణమన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ ముందే డిసైడ్ అయిందని కవిత వ్యాఖ్యలు చేశారు.

# మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

### ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే

### అయినా గణనీయంగా తమ బలాన్ని పెంచుకున్నాం

### మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్స్‌అఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. ఈ-ఫార్ములా కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఐదుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు

### కాంగ్రెస్ అక్రమాలతో గెలుపు : మాజీమంత్రి తలసాని శ్రీనివాసయాదవ్



**సిద్దిపేట,ఫిబ్రవరి14 :** మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ పలు దౌర్జన్యాలకు పాల్పడిందని, డబ్బులు, మద్యం ఏరులై పారించిందని మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులు మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్లలాగా కాంగ్రెస్ గెలిచిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారని కొనియాడారు. రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు. ప్రజలు శాశ్వతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ టికెట్ పెట్టి పురుషులకు డబుల్ రెట్లు పెంచారని ఆరోపించారు.కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారని, రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టమని, తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్ లు నిర్మించారని తెలిపారు. గతంలో నీరు, విద్యుత్ లేక రైతులు ఇబ్బంది పడ్డారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారని గుర్తు చేశారు.తాను టీడీపీ లో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేదని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వంలో కుదేలయింది ని, కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయని అన్నారు. సిద్దిపేటను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారని ప్రశంసించారు.

## ఎక్స్ అఫీషియో సభ్యులకు ఓటు హక్కు

### రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టీకరణ

**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** మున్సిపల్ పరోక్ష ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన జారీ చేసింది. మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓటుహక్కుపై స్పష్టతనిచ్చింది. తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం-2019 ప్రకారం.. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఇతర ఎక్స్‌అఫీషియో సభ్యులకు ఓటు హక్కు తప్పనిసరి అని తెలిపింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కానివారు ఓటు వేసేందుకు అనర్హులని సీఈసీ స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కాకుండా ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఓటువేసే వారిని అనర్హులుగా పరిగణిస్తారని, వారి ఓట్లు చెల్లవని న్యాయస్థానం తెలిపింది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సీఈసీ సర్క్యులర్ జారీ చేసింది. నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది. దీంతో స్థానిక ఓటు హక్కు ఉంటేనే ఎంపీలు, ఎమ్మెల్సీలు.. మేయర్/ఛైర్ పర్సన్ పదవుల ఎన్నికల్లో ఓటువేసి ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది.

## జగిత్యాలలో విచిత్ర పరిస్థితి

### జీవన్ రెడ్డి, సంజయ్‌ల పోటాపోటీ క్యాంపులు

**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి కోసం రెండు పార్టీలు ప్రయత్నాలు చేయటం చూస్తుంటాం. కానీ, జగిత్యాలలో మాత్రం విచిత్ర పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీకే చెందిన జీవన్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన తమ అభ్యర్థులతో వేర్వేరుగా క్యాంపులు ఏర్పాటు చేశారు. శుక్రవారమే కాంగ్రెస్ బీ ఫాం మీద గెలుపొందిన నేతలు, స్వతంత్రులు, ఎంఐఎం కౌన్సిలర్లతో కలిపి 23 మందితో ఎమ్మెల్యే సంజయ్ క్యాంపునకు బయలు దేరగా.. శనివారం తన వర్గంలోని 14 మంది కౌన్సిలర్లతో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. రెండు వర్గాలు క్యాంపు రాజకీయాలు మొదలు పెట్టడంతో జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఈ పదవి కోసం నలుగురు పోటీ పడుతుండగా.. జీవన్‌రెడ్డి వర్గానికి వరిస్తుందా లేక సంజయ్ వర్గానికా అనేది పెద్ద ప్రశ్నగా మారింది. అయితే, ఛైర్‌పర్సన్ పదవి ఎంపికపై కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

## పార్టీ మారిన పలువురికి తప్పని ఓటమి

### ఓటుతో ప్రజలు దూరం పెట్టిన వైనం

**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** పదవుల కోసం ఇష్టారీతిన పార్టీలు మారిన నేతలకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు గట్టిగా బుద్ధిచెప్పారు. పలు జిల్లాల్లో పార్టీ మారిన వారిని ప్రజలు తిరస్కరించారు. బీఆర్ఎస్ పార్టీలో పదవులు అనుభవించి, అసవరాలు తీరగానే అవతలి పార్టీలకు వెళ్లిన పలువురికి ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు షాకిచ్చారు. నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌కు చెందిన వేంరెడ్డి రాజు గతంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ నుంచి బీఆర్ఎస్ తరపున కౌన్సిలర్‌గా గెలిచారు. దాంతో అతడికి బీఆర్ఎస్ పార్టీ ఛైర్మన్ పదవి కట్టబెట్టింది. పార్టీలో మున్సిపల్ ఛైర్మన్ పదవి అనుభవించిన అతను ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఆయన తన భార్య వేంరెడ్డి సంధ్యను కౌన్సిలర్‌గా బరిలో దించారు. 16వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన ఆమెను ఏకంగా 374 ఓట్ల తేడాతో ఓడించి రాజుకు దిమ్మతిరిగేలా చేశారు. మెదక్ జిల్లా గజ్వేల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ తరపున కౌన్సిలర్‌గా గెలిచిన గాడిపల్లి భాస్కర్‌ను ఛైర్మన్ పదవి కూడా వరించింది. 2014 నుంచి 2020 వరకు ఏకంగా ఆరేళ్లు మున్సిపల్ ఛైర్మన్ పదవి అనుభవించాడు. అవసరం తీరిన తర్వాత బీఆర్ఎస్‌ను వదిలేసి బీజేపీలో చేరాడు. ఈ ఎన్నికల్లో ఆయన భార్య గాడిపల్లి కళ్యాణిని బీజేపీ అభ్యర్థిగా బరిలో దించాడు. కానీ ఓటర్లు కళ్లుబైర్లు కమ్మేలా షాకిచ్చారు. ఏకంగా 529 ఓట్ల తేడాతో ఓడించారు. బీఆర్ఎస్ అభ్యర్థి గోలి మమత ఆమెపై ఘన విజయం సాధించారు. ఎన్నికల్లో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ప్రచారం చేసినా బీజేపీ అభ్యర్థికి ప్రయోజనం దక్కలేదు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు ఛైర్మన్ పదవి అనుభవించి, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ అయిన వ్యక్తికి ఓటర్లు బుద్ధిచెప్పారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మున్సిపాలిటీలో మల్లెల రాజశ్రీ బీఆర్ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. ఆ తర్వాత ఛైర్‌పర్సన్ పదవి దక్కింది. బీఆర్ఎస్‌లో పదవి అనుభవించిన మల్లెల రాజశ్రీ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ అయ్యారు. ఈ ఎన్నికల్లో కూడా భీంగల్ మున్సిపాలిటీలోని 9వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. అయితే ఓటర్లు ఆమెకు షాకిచ్చారు. ఆమెపై బీఆర్ఎస్ అభ్యర్థి రవి నీలం 75 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

## రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు
# కేబినేట్ ఆమోదం

**అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణం**

**ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటు**

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శనివారం జరగిన కేంద్ర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ.1,60,504 కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోహుపూర్-నుమాలిఘర్ మధ్య అండర్ వాటర్ రోడ్డు టన్నెల్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. 34 కిలోమీటర్ల మేర అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ టన్నెల్ నిర్మాణంతో 250 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా 6 గంటల సమయం పట్టే గమ్యస్థానాన్ని కేవలం 20 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉంది. బ్రహ్మపుత్ర నది కింద రైల్వేలైన్, నేషనల్ హైవే కోసం టన్నెల్‌ని నిర్మించనుంది. అలాగే కసారా-మన్మాడ్ మూడు, నాలుగో రైల్వేలైన్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బళ్లారి-హోస్పేట మధ్య రూ.2,372 కోట్లతో 3, 4 రైల్వేలైన్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. గూడె బేల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ.3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్ , నారాయణపేట, రాయచూర్, దేవరకద్ర, హైదరాబాద్‌కు ఈ కనెక్టివిటీ ఉంది. హైదరాబాద్-పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3175 కోట్ల ఖర్చు చేయనుంది. దమాసియా- బిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి రూ.4,584 కోట్లను ఖర్చు చేయనుంది. గోతి- త్రిమ్బక్ - పాల్గర్ సెక్షన్ అప్‌గ్రేడేషన్ కోసం రూ.3320 కోట్లని కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

# క్యాన్సర్ రోగులకు భారీ ఊరట

**దేశవ్యాప్తంగా డే కేర్ సెంటర్లు.. కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

**న్యూఢిల్లీ :** క్యాన్సర్ రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడేళ్లలో ఈ కేంద్రాలను నెలకొల్పనుండగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 200 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నిర్ణయంతో కీమోథెరపీ వంటి కీలక చికిత్సలు రోగుల నివాస ప్రాంతాలకు దగ్గరగా అందుబాటులోకి రానున్నాయి. క్యాన్సర్ చికిత్స కోసం రోగులు నెలల తరబడి ఎన్నోసార్లు ఆసుపత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలు కీమోథెరపీ కోసం నగరాల్లోని పెద్ద ఆసుపత్రులకు ప్రయాణించడం శారీరకంగా, ఆర్థికంగా పెనుభారంగా మారుతోంది. ప్రయాణం, బస, ఆహారం, రోజువారీ వేతనం కోల్పోవడం వంటి ఖర్చులు కుటుంబాలను కుంగదీస్తున్నాయి. కీమోథెరపీ తీసుకునే రోగులు బలహీనంగా ఉండటంతో, వారికి సహాయకులు తోడుగా వెళ్లాల్సి రావడం అదనపు భారం. ఈ ఇబ్బందులను దూరం చేసేందుకే ప్రభుత్వం జిల్లాస్థాయిలో ఈ డే కేర్ కేంద్రాలను ప్రారంభిస్తోంది. ఈ కేంద్రాల ఏర్పాటుకు ముందు ప్రభుత్వం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో కలిసి లోటుపాట్లపై అధ్యయనం చేసింది. క్యాన్సర్ కేసుల సంఖ్య, రోగుల భారం, మౌలిక సదుపాయాల లభ్యత ఆధారంగా జిల్లాలను ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లాల్లోని వైద్యులు, నర్సులకు ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాల్లో 4 నుంచి 6 వారాల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కీమోథెరపీ మందుల మోతాదు, దుష్ప్రభావాల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల ఎదుర్కోవడం, మందుల భద్రత వంటి అంశాల్లో వారికి శిక్షణనిచ్చారు. ఈ కేంద్రాల ద్వారా అవసరమైన కీమోథెరపీ మందులను ఉచితంగా అందించనున్నారు. క్యాన్సర్ చికిత్సలో మందుల ఖర్చు అధికంగా ఉండే నేపథ్యంలో ఈ నిర్ణయం రోగులపై ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. మందుల కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం సరఫరా వ్యవస్థను కూడా బలోపేతం చేస్తోంది.

# అమెరికా ఒప్పందంతో రైతులకు తీవ్ర నష్టం

**కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ :** అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రధాని, ఆయన కేబినెట్ మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని ఆయన ఎక్స్‌లో దుయ్యబట్టారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు.భారత్‌లోని టెక్స్‌టైల్ రంగం 5 కోట్ల కుటుంబాలకు ఉపాధినిస్తోంది. నరేంద్ర మోదీ అమెరికాతో చేసుకున్న ఒప్పందం భారత టెక్స్‌టైల్ రంగాన్ని అంతం చేస్తుంది. ఈ విషయం నరేంద్ర మోదీకి, మొత్తం భారతదేశానికి తెలుసు. అదే నేను పార్లమెంటులో చెప్పాను. బంగ్లాదేశ్‌కు 0% పన్ను, భారత్‌కు 18% పన్ను విధిస్తున్నారు. అందువల్ల భారత టెక్స్‌టైల్ పరిశ్రమను బంగ్లాదేశ్ టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతీస్తుంది. మనకు కూడా ఆ రాయితీ కావాలంటే అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకోవాలని కేంద్రమంత్రి ఒకరు చెప్పారు. కానీ అసలు నిజం ఏమిటంటే మన పత్తి బంగ్లాదేశ్‌కు వెళ్తుంది. మన పత్తి ద్వారానే భారత్‌లో టెక్స్‌టైల్ మిల్లులు నడుస్తున్నాయి. ఒకవేళ మనం బంగ్లాదేశ్ లాగా అమెరికా పత్తిపై ఆధారపడితే మన దేశంలో పత్తి రైతులు, వస్త్ర పరిశ్రమ నాశనమైపోతాయి. ఒకవేళ మనం అమెరికా పత్తిని దిగుమతి చేసుకోకపోతే మన టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతింటుంది. ఇదే అసలు నిజం. పీయూష్ గోయల్ అబద్ధాలు చెప్పవద్దు. అందుకే 'సరెండర్' అంటున్నాను. ఎందుకంటే ఈ ఒప్పందం వల్ల పత్తి రైతు నష్టపోతాడని అన్నారు. ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్? గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ? ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్? గాంధీ విమర్శించారు.గత వారం భారత్?-అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో యూఎస్? పారిశ్రామిక వస్తువులు, విస్తృత శ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడం వంటివి ఆ ఒప్పందంలో ఉన్నాయి. వీటిలో పశుగ్రాసం కోసం ఎర్ర జొన్న, చెట్ల గింజలు, తాజా ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్, అదనపు ఉత్పత్తులు ఉన్నాయి. ప్రతిగా, యునైటెడ్ స్టేట్స్ వస్త్రాలు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు, సేంద్రీయ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు వంటి ఎంపిక చేసిన భారతీయ వస్తువులపై 18 శాతం సుంకాలను వర్తింపజేయనుంది. అయితే ఒప్పందం పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత, జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వజ్రాలు, విమాన భాగాలు వంటి వస్తువులపై అమెరికా విధించిన సుంకాలు తొలగిపోనున్నాయి.

# దేశ భద్రతను కాంగ్రెస్ ప్రమాదంలో పడేస్తుంది

**ఈశాన్య ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తున్నాం!**

**అసోంకు కీలకం కానున్న రాబోయే ఐదేళ్లు**

**ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనేవారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేయాలని నినాదాలు చేసేవారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని విమర్శించారు. దేశాన్ని విభజించాలనుకునేవారే కాంగ్రెస్ ఆరాధకులుగా మారుతారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ముస్లిం లీగ్ దేశాన్ని విభజించిందని, ఇప్పుడు నేటి కాంగ్రెస్ 'ముస్లిం లీగ్ మావోయిస్టు కాంగ్రెస్'గా మారిందని దుయ్యబట్టారు. అందుకే కాంగ్రెస్ పట్ల అసోం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసోం ఆకలితో అలమటించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. అలాగే భయం గుప్పిట్లో ఉందన్నారు. అభివృద్ధి కోసం నిధులు ఇవ్వకుండా తప్పించుకునే హస్తం పార్టీ అసోంను అభివృద్ధి చేయగలదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కేంద్రం నుంచి అసోం పన్ను వాటాగా రూ.10,000 కోట్లు మాత్రమే అందుకునేదన్నారు. ఇప్పుడు బీజేపీ సర్కార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కన్నా 5 రెట్లు ఎక్కువను పన్ను వాటాగా అందుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విస్మరించిన ఈశాన్య ప్రాంతాలకు తాము భక్తితో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ అసంతృప్తికి అతిపెద్ద కారణం ఓటు బ్యాంకు రాజకీయాలే. హస్తం పార్టీ ఎప్పుడూ అసోంను ఎన్నికల కోణంలోనే చూసింది. ఆ పార్టీ హయాంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అసోంకు చేరడానికి సంవత్సరాల కాలం పట్టింది. కానీ బీజేపీ ఎల్లప్పుడూ అసోం, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూనే ఉంది. కొంతకాలం క్రితం దేశంలో మొట్టమొదటి స్లీపర్ వందే భారత్ రైలు అసోం నుంచే ప్రారంభమైంది. సెమీకండక్టర్ రంగంలో అసోం వృద్ధి ఇంజిన్‌గా మారుతోంది. ఇక్కడ తయారయ్యే చిప్‌ల గురించి అసోం టీ లాగా ప్రపంచవ్యాప్తంగా చర్చించుకునే రోజు ఎంతో దూరంలో లేదు. ఆ రాష్ట్ర వృద్ధి ప్రయాణాన్ని చాయ్ నుంచి చిప్స్ వరకు చూడవచ్చని అన్నారు. కాంగ్రెస్ హయాంలో 3జీ, 4జీ టెక్నాలజీ వచ్చిందని, అలాగే 2+ స్కామ్ కూడా వచ్చిందని మోదీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో ఎయిమ్స్‌ల గురించి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో అసోంలో హింస, వేర్పాటువాదం ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలో ఎన్?డీఏ సర్కార్ శాంతి, శ్రేయస్సు, వేగవంతమైన అభివృద్ధి అనే సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఒకప్పుడు బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన అసోంలో ఇప్పుడు శాంతి నెలకొందన్నారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఈశాన్య ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని మోదీ మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్?డీఏ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తుందని అన్నారు. అసోంలో మౌలిక సదుపాయాల పెంపుదలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాంగ్రెస్ భారత్‌ను ఒక దేశంగా పరిగణించడానికి కూడా నిరాకరిస్తుందని, భారతమాత పట్ల కనీస గౌరవం కూడా చూపదని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తగా ఉండటం తన జీవితంలోని గొప్ప గౌరవం అన్నారు. "2014 నాటికి దేశంలో కేవలం 6 ఎయిమ్స్‌లు మాత్రమే ఉన్నాయి. ఆ ఏడాదే దేశానికి సేవ చేసే అవకాశాన్ని ప్రజలు నాకు ఇచ్చారు. ఆ తర్వాత కాలంలో ఎయిమ్స్‌ల సంఖ్య భారీగా పెరిగింది. బీజేపీ సర్కార్ గువాహటిలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసింది. నిన్ననే 'పీఎం-రాహత్' పథకానికి ఆమోదం తెలిపాం. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా, ఎవరైనా ప్రమాదంలో గాయపడితే కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్సను అందిస్తుంది. గత 11 ఏళ్లలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం అసోంకు కేంద్ర ప్రభుత్వం రూ.5.5 లక్షల కోట్లకు పైగా నిధులను కేటాయించింది. ఈశాన్య ప్రాంతాల కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాం. కనెక్టివిటీ పెరిగే కొద్దీ ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇటీవల గువాహటిలో పరీక్ష పే చర్చ కార్యక్రమం జరిగింది. బ్రహ్మపుత్ర నదిపై క్రూయిజ్‌లో విద్యార్థులతో నేను చర్చించాను. రాబోయే ఐదేళ్లు అసోంకు చాలా కీలకం." అని మోదీ పేర్కొన్నారు. అసోం అభివృద్ధిలో, ప్రజల జీవితాల్లో బ్రహ్మపుత్ర నదిది ప్రముఖ పాత్ర అని మోదీ పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ 70 ఏళ్ల పాలనలో బ్రహ్మపుత్ర నదిని దాటడం ఎల్లప్పుడూ పెద్ద సవాలుగా ఉందదేదని ఆరోపించారు. దాదాపు 7 దశాబ్దాల పాలనలో ఆ పార్టీ బ్రహ్మపుత్ర నదిపై కేవలం 3 వంతెనలను మాత్రమే నిర్మించాయన్నారు. గత 10-11 ఏళ్లలో బీజేపీ సర్కార్ బ్రహ్మపుత్ర నదిపై ఐదు పెద్ద వంతెనలను పూర్తి చేసిందని తెలిపారు. కాంగ్రెస్ అసోంకు సమస్యలను మాత్రమే ఇచ్చిందని, బీజేపీ మాత్రం వాటికి పరిష్కారాలను చూపిందన్నారు.

## జాతీయ రహదారిపై విమాన ల్యాండింగ్ సౌకర్యం

**అసోంలో ల్యాండ్ అయిన ప్రధాని మోడీ విమానం**

**గౌహతి :** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. అస్సాం పర్యటన నిమిత్తం అక్కడకు చేరుకున్నారు. దిబ్రూగఢ్ - మోరాన్ జాతీయ రహదారిపై నిర్మించిన అత్యవసర ల్యాండింగ్ ఫెసిలిటీ రోడ్డుపై మోదీ ప్రయాణించిన ప్రత్యేక విమానం దిగింది. దీంతో అస్సాంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైనట్టయింది. ఆ తర్వాత.. మోదీ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఏర్పాటుచేసిన యుద్ధ, రవాణా, ఎయిర్‌క్రాఫ్ట్‌ల వైమానిక ప్రదర్శనను వీక్షించారు. ఈ ఈఎల్ఎఫ్ గురించి ఎక్స్ వేదికగా ప్రత్యేక పోస్ట్ చేశారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఫెసిలిటీ కీలకం కానుందని పేర్కొన్నారు మోదీ. ఈశాన్య భారతదేశంలో ఏర్పాటుచేసిన ఈ ఎమ్జ్గ÷న్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ(ఇఒఈ).. చైనా సరిహద్దుకు 300 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇటీవల నిర్మించిన 4.2 కిలోమీటర్ల ఈ హైవేపై రఫేల్, సుఖోయ్ వంటి యుద్ధ విమానాలను ల్యాండ్ చేయవచ్చు. అంతేకాకుండా.. అత్యవసర పరిస్థితుల్లో సైనిక, పౌర విమానాలను దింపేందుకూ ఇది ఉపయుక్తం కానుంది. దిబ్రూగఢ్ ఎయిర్‌పోర్ట్, చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్లలో కార్యకలాపాలు నిర్వహించలేని సందర్భాల్లో దీనిని ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవచ్చు.దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ఏమైనా ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు.. భారత వాయుసేన వేగంగా స్పందించేందుకూ మార్గం సుగమం కానుంది. టేకాఫ్, ల్యాండింగ్ రెండింటికీ అనుకూలంగా ఈ ఫెసిలిటీని డిజైన్ చేశారు. పశ్చిమ, ఉత్తర, మధ్య భారతంలో ఇప్పటికే ఈ ఈఎల్ఎఫ్‌లు ఉన్నాయి.

## ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు

**మోదీ ప్రభుత్వం వాళ్ల ఇంటికెళ్లి కొట్టింది**

**కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శలు**

**న్యూఢిల్లీ :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలనలో ఉగ్రదాడులకు సరైన సమాధానం దొరకలేదని, మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెప్పిందని వ్యాఖ్యానించారు. 2019 ఫిబ్రవరి 14 జరిగిన పుల్వామా ఉగ్రదాడిని ఉటంకిస్తూ, ప్రతీకారం తీర్చుకునే కొత్త సంప్రదాయానికి మోదీ శ్రీకారం చుట్టారని షా పేర్కొన్నారు. యూపీఏ పాలనలో పాకిస్థాన్ ఉగ్రవాదులు, భారత సైనికులపై తీవ్ర స్థాయిలో దాడులు జరిపారని ఆరోపించారు. కానీ మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన సైనికులు, శత్రువుల భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాదులను అంతమొందించారని చెప్పారు. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని కారైకల్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో అమిత్ షా ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు నివాళులర్పించారు.పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళులు అర్పిస్తున్నాను. కాంగ్రెస్ పాలనలో, పాకిస్థాన్ ఉగ్రవాదులు ప్రతిరోజూ మన సైనికులపై దాడి చేసేవారు. దీనిపై దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి లేదా రక్షణ మంత్రి నుంచి ఎటువంటి స్పందన ఉండేది కాదు. కానీ పుల్వామా దాడికి ప్రతీకారంగా మోదీ ప్రభుత్వం వైమానిక దాడులు చేసింది. పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించి, ఉగ్రవాద స్థావరాలను మట్టికరిపించింది. ప్రధాని మోదీ హయాంలో మొదట సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చిందని అన్నారు. మరోవైపు, పుదుచ్చేరిలోని బీజేపీ బహిరంగ సభలో పాల్గొన్న అమిత్ షా ఆ ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు రావడానికి రెండు లక్ష్యాలు ఉన్నాయని షా పేర్కొన్నారు. అందులో మొదటిది మోదీ, రంగ స్వామి నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ సాధించిన విజయాలను ప్రజల ముందు ఉంచడానికని, రెండోది అవినీతి శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న UPA - INDI కూటమిల ముసుగును బయటపెట్టడానికని షా వ్యాఖ్యానించారు. ఐదు సంవత్సరాల క్రితం, పుదుచ్చేరి ప్రజలు ప్రధాని మోదీ, రంగస్వామి నాయకత్వంలో ఇక్కడ ఎన్?డీఏ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. భారత్?ను సుసంపన్నంగా, సురక్షితంగా మార్చడానికి ప్రధాని మోదీ కృషి చేశారు. పుదుచ్చేరి ప్రజలు ఎన్‌డీఏ, బీజేపీ, రంగస్వామి, ప్రధాని మోదీపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో, పుదుచ్చేరి ప్రజలు 44% ఓట్లను గెలుచుకుంది. కానీ ఈసారి బీజేపీ, ఎఐఎన్?ఆర్?సీ, ఎఐఏడీఎంకే కూటమి 60% ఓట్లతో సీట్లను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే పుదుచ్చేరిలో ఎన్?డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధానంగా మూడు పనులు చేసింది. అందులో మొదటిది అవినీతిని అంతం చేయడం, రెండోది పుదుచ్చేరిని స్వయంప్రతిపత్తి కలిగిన కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం, మూడోది పుదుచ్చేరికి రాజకీయ స్థిరత్వాన్ని తీసుకురావడం వంటి పనులు చేసింది." అని అమిత్ షా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ జవాన్లపై జరిగిన ఉగ్రదాడిని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. జవాన్ల ప్రాణ త్యాగాన్ని భారత్ ఎన్నటికీ మరిచిపోదన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టే మన భద్రతా దళాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువని, దానిని పూర్తిగా నిర్మూలించేందుకు భారత్ కట్టుబడి ఉందని మోదీ పేర్కొన్నారు.

# అధికార మార్పు జరగాలి

**ఇరాన్‌లో సైనిక చర్యపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై సైనిక చర్యకు సంబంధించిన ఆలోచనలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అధికార మార్పు జరిగితే అది ఉత్తమ పరిణామం అవుతుందని అన్నారు. ట్రంప్ ప్రభుత్వం మధ్యప్రాచ్యానికి రెండో విమాన వాహక నౌకను పంపిస్తున్నట్లు ప్రకటించిన కొద్ది గటంలకే ఈ వ్యాఖ్యలు చేశారు.'ఇరాన్‌లో అధికార మార్పు జరిగితే అదే ఉత్తమం. 47 ఏళ్లుగా వారు మాట్లాడుతూనే ఉన్నారు. చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే అపార శక్తి అక్కడికి చేరుకుంది. మరిన్ని బలగాలు కూడా వెళ్తున్నాయి. దీనిని ఒకేసారి పూర్తిగా ముగిస్తే మంచిదే. ఇరాన్‌పై తన ప్రధాన లక్ష్యం అణు కార్యక్రమాన్ని నియంత్రించడమే అయినప్పటికీ, అది మాత్రమే కాకుండా ఇతర అంశాలు కూడా కీలకం. చర్చలు విజయవంతం అవుతాయని అనుకుంటున్నా. విఫలమైతే అది ఇరాన్‌కు చాలా చెడు రోజు అవుతుంది' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ తన అణు కార్యక్రమంపై తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఒత్తిడి పెంచుతూ, ట్రంప్ ప్రభుత్వం మధ్యప్రాచ్యానికి రెండో విమాన వాహక నౌకను పంపాలని నిర్ణయించింది. ప్రపంచంలోనే అతిపెద్ద యుద్ధనౌకగా పేరుగాంచిన యూఎస్?ఎస్? జెరాల్డ్ ఆర్. ఫోర్డ్ ప్రస్తుతం కరేబియన్ సముద్రం నుంచి పశ్చిమాసియా దిశగా బయలుదేరుతోంది. గతంలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించిన ఆపరేషన్‌లో కూడా యూఎస్?ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్ కీలక పాత్ర పోషించింది. ఇప్పటికే మధ్య ప్రాచ్యంలో ఉన్న యూఎస్?ఎస్ అబ్రహం లింకన్ నౌకతో పాటు, ఇప్పుడు 'ఫోర్డ్' కూడా చేరనుంది. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే, యుద్ధనౌక యూఎస్?ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్ అవసరం అవుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు.ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం తర్వాత ఇప్పటికే అస్థిరంగా ఉన్న మధ్యప్రాచ్యంలో, ఈ పరిణామం మరో ప్రాంతీయ యుద్ధానికి దారితీయవచ్చని గల్ఫ్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గత వారం ఒమన్, ఖతార్ దేశాల మధ్యవర్తిత్వంతో ఇరాన్‌తో చర్చలు జరుగుతాయని అమెరికా భావించినప్పటికీ, అవి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో సైనిక ఒత్తిడిని పెంచాలని భావిస్తోంది. ఇదే సమయంలో దేశవ్యాప్త నిరసనలపై ఇరాన్ ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యల వల్ల అంతర్గత ఒత్తిడి పెరుగుతోంది. మృతుల కోసం 40వ రోజు సంతాప కార్యక్రమాలు నిర్వహిస్తున్న కుటుంబాలు ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను మరింత పెంచుతున్నాయి.యూఎస్?ఎస్ ఫోర్డ్ ఇప్పటికే ఎనిమిది నెలలుగా సముద్రంలోనే ఉందని అమెరికా నేవీ టాఫ్ అధికారి అడ్మిరల్ డారిల్ కాడిల్ తెలిపారు. సాధారణంగా యుద్ధ నౌకలు ఆరు లేదు ఏడు నెలలు మాత్రమే మోహరించబడతాయని చెప్పారు. అయితే వాటి ?పొడిగింపు సిబ్బంది జీవితాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. కుటుంబ కార్యక్రమాలు, వివాహాలు, పిల్లల జననాలు కూడా దెబ్బతింటాయని పేర్కొన్నారు. దీంతో నౌక మరమ్మతులు, నిర్వహణ షెడ్యూల్ కూడా దెబ్బతినే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. 2015లో కుదిరిన అణు ఒప్పందం నుంచి 2018లో అమెరికా తప్పుకోవడంతో పరిస్థితులు మరింత క్లిష్టమయ్యాయి. అప్పటి నుంచి ఇరాన్ అధిక స్థాయిలో యురేనియం సమృద్ధి చేయడం ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఆంక్షల కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఆంక్షల ఎత్తివేతను చర్చల్లో కీలక అంశంగా టెహ్రాన్ భావిస్తోంది. మరోవైపు ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత ప్రయోజనాల కోసమేనని చెబుతోంది. అయితే గతంలో 60 శాతం వరకు యురేనియం శుద్ధి చేయడం అంతర్జాతీయ ఆందోళనకు కారణమైంది.



# పాకిస్తాన్ తో కీలక మ్యాచ్ కోసం
# టీమిండియా కసరత్తు

**సమాలోచనలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్**

**నలుగురు కీలక ప్లేయర్లను బరిలోకి దిగే చాన్స్**

**నేడు కొలంబోలో పాక్ తో ఇండియా మ్యాచ్**



2026 టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్‌తో జరిగే కీలక పోరుకు భారత జట్టు సిద్ధంగా ఉంది. ఈ బ్లాక్‌బస్టర్ మ్యాచ్ కోసం కోచ్ గౌతమ్ గంభీర్ ఓ మాస్టర్ ప్లాన్ రూపొందించాడు. ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఒకేసారి నలుగురు మ్యాచ్ విన్నింగ్ స్పిన్నర్లను రంగంలోకి దింపేందుకు సిద్ధమయ్యాడు. అంటే, ఫిబ్రవరి 15న కొలంబోలో జరిగే మ్యాచ్‌లో కోచ్ గౌతమ్ గంభీర్ తన స్పిన్ అస్త్రాలను పాకిస్థాన్ జట్టుపై ప్రయోగించేందుకు సిద్ధమయ్యాడు. భారత స్పిన్ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడు. జట్టులో చేరాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో సుందర్‌కు ఆడే అవకాశం రాలేదు. కానీ, కోచ్ గౌతమ్ గంభీర్ ఈ యువ స్పిన్ ఆల్ రౌండర్‌ను పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో నేరుగా బరిలోకి దించవచ్చని భావిస్తున్నారు. సుందర్ తన బౌలింగ్ తోనే కాదు, బ్యాటింగ్ ఆర్డర్‌లో భారీ షాట్లు కూడా కొట్టగలడు. ఇది మ్యాచ్‌లో కీలకం అవుతుంది. 2026 టీ20 ప్రపంచ కప్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం ఇవ్వలేదు. అయితే, కుల్దీప్ యాదవ్ ఆర్. ప్రేమదాస స్టేడియంలో పాకిస్థాన్‌పై ఆడే ఛాన్స్ ఉంది. పాకిస్తాన్‌తో జరిగిన 3 టీ20 మ్యాచ్‌ల్లో కుల్దీప్ 8 వికెట్లు పడగొట్టాడు. అదే సమయంలో 6.58 ఎకానమీ రేటును కూడా కొనసాగించాడు. అందుకే కోచ్ గౌతమ్ గంభీర్ కుల్దీప్‌ను ఎలాగైనా ఆడించాలని కోరుకుంటాడు. గతంలో పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టిన ఆర్. ప్రేమదాస పిచ్‌పై కుల్దీప్ యాదవ్ భారత్‌కు గేమ్ ఛేంజర్‌గా నిరూపించబడవచ్చు. భారత జట్టు వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ పాత్ర పాకిస్తాన్ పై చాలా ముఖ్యమైనది కానుంది. ఎందుకంటే, అక్షర్ తన ఎడమ చేతి వేలు స్పిన్ తో పాకిస్తాన్ ను ఇబ్బంది పెట్టడమే కాకుండా, బ్యాట్ తో భారీ ఇన్నింగ్స్ ఆడే సామర్థ్యం కూడా కలిగి ఉన్నాడు. పాకిస్థాన్‌తో జరిగే బిగ్ మ్యాచ్‌లో అక్షర్ పటేల్ తన నాలుగు ఓవర్లలో వీలైనన్ని ఎక్కువ వికెట్లు తీయాలని లక్ష్యంగా పెట్టుకుంటాడు. కోచ్ గౌతమ్ గంభీర్ మాస్టర్ ప్లాన్ ప్రకారం, అక్షర్ ఈ ప్రయత్నంలో కీలక ఆటగాడు కావొచ్చు. కుడిచేతి వాటం మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్పిన్ చాలా మంది బ్యాట్స్‌మెన్‌లకు అర్థం కాదు. అయితే, స్పిన్-ఫ్రెండ్లీ ఆర్. ప్రేమదాస పిచ్‌పై, వరుణ్ మరింత ప్రమాదకరమైన బౌలర్‌గా మారవచ్చు. పాకిస్థాన్‌తో జరిగిన నాలుగు టీ20ఐలలో వరుణ్ కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసుకున్నప్పటికీ, 2026 ప్రపంచ కప్‌లో తన గణాంకాలను మార్చుకోవాలని చూస్తున్నాడు. 2026లో భారతదేశం తరపున ఐదు మ్యాచ్‌ల్లో వరుణ్ ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. అతని ఎకానమీ రేటు కేవలం 7.72 మాత్రమే.



## ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌పై
## ఇంగ్లాండ్ విజయం

టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా నేడు కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ అద్భుత విజయం సాధించింది. 5 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తుచేసింది. వెస్టిండీస్ చేతిలో ఓటమి తర్వాత డీలా పడ్డ ఇంగ్లాండ్‌కు ఈ గెలుపు టానిక్‌లా పనిచేసింది. మొదట బౌలింగ్లో అదిల్ రషీద్ మాయ చేయగా, ఛేజింగ్ లో టామ్ బాంటన్ వీరోచిత ఇన్నింగ్స్ తో జట్టును గెలిపించాడు. స్కాట్లాండ్ నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మరో 10 బంతులు మిగిలి ఉండగానే, 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ గెలుపుతో ఇంగ్లాండ్ తన సూపర్-8 అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ సారథి హ్యారీ బ్రూక్ బౌలింగ్ ఎంచుకోవడంతో స్కాట్లాండ్ బ్యాటింగ్ కు దిగింది. ఇంగ్లీష్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు స్కాట్లాండ్ బ్యాటర్లు నిలవలేకపోయారు. ఆ జట్టు నిర్ణీత 19.4 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌట్ అయ్యింది. స్కాట్లాండ్ తరపున రిచీ బెరింగ్టన్ 49 పరుగులతో ఒంటరి పోరాటం చేయగా, టామ్ బ్రూస్ 24 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో వెటరన్ స్పిన్నర్ అదిల్ రషీద్ 36 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. పేసర్ జోఫ్రా ఆర్చర్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి స్కోరును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (2), జాస్ బట్లర్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఆ తర్వాత వచ్చిన జాకబ్ బెథెల్, కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా స్వీప్ షాట్లకు ప్రయత్నించి వికెట్లు పారేసుకున్నారు. దీంతో ఇంగ్లాండ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. అయితే ఈ దశలో క్రీజులోకి వచ్చిన టామ్ బాంటన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 41 బంతుల్లోనే అజేయంగా 63 పరుగులు చేశాడు. ముఖ్యంగా మార్క్ వాట్ వేసిన ఒకే ఓవర్లో మూడు భారీ సిక్సర్లు బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. సామ్ కరన్ (28) అతనికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో విల్ జాక్స్ విన్నింగ్ షాట్ కొట్టి లాంఛనం పూర్తి చేశాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడిన టామ్ బాంటన్ కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ గ్రూప్-సి పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపచుకుని తదుపరి దశకు వెళ్లే అవకాశాలను పెంచుకుంది. మరోవైపు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ స్కాట్లాండ్ కు నిరాశే మిగిలింది.

## ఆఫ్ఘనిస్తాన్ జట్టు సభ్యుడికి గుండెపోటు..



టీ20 వరల్డ్ కప్ 2026 కోసం ఇండియాలో పర్యటిస్తున్న ఆఫ్ఘనిస్తాన్ జట్టులో ఆందోళన కలిగించే ఘటన చోటుచేసుకుంది. ఆ జట్టులో కీలక సభ్యుడికి గుండెపోటు రావడంతో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. ఈ వార్త తెలిసిన వెంటనే క్రీడా ప్రపంచం ఉలిక్కిపడింది. ప్రస్తుతం ఆఫ్ఘన్ జట్టు సభ్యుడికి ఢిల్లీలోని ప్రముఖ ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టుకు పర్ఫామెన్స్ అనలిస్ట్‌గా సేవలు అందిస్తున్న కేసీ రామ సుబ్రమణియన్.. జట్టుతో కలిసి ఢిల్లీలోని ఒక హోటల్‌లో ఉంటున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. ఆయన అస్వస్థతకు లోనవ్వడాన్ని గమనించిన జట్టు మెడికల్ సిబ్బంది వెంటనే స్పందించి హోటల్‌లోనే ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం పరిస్థితి విషమించకుండా ఉండేందుకు వెంటనే దక్షిణ ఢిల్లీలోని ఫోర్టిస్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తరలించిన వెంటనే వైద్యులు ఆయనను పరీక్షించి అత్యవసరంగా యాంజియోప్లాస్టీ సర్జరీ నిర్వహించారు. ప్రస్తుతం రామ సుబ్రమణియన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. అయినప్పటికీ ముందస్తు జాగ్రత్తగా ఆయన్ని ఐసీయూలో ఉంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనతో ఆఫ్ఘన్ ఆటగాళ్లు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. జట్టు కెప్టెన్ రషీద్ ఖాన్, సీనియర్ ప్లేయర్ మొహమ్మద్ నబీ ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో రామ సుబ్రమణియన్ కుటుంబానికి ప్రైవసీ కల్పించాలని ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు విజ్ఞప్తి చేసింది. మరోవైపు ఈ ఘటనపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సానుకూలంగా స్పందించాయి. రామ సుబ్రమణియన్‌కు అవసరమైన అన్ని రకాల వైద్య సహాయం అందిస్తామని రెండు సంస్థలు ప్రకటించాయి. ఇప్పటికే ఆయా సంస్థల ప్రతినిధులు ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు.

## దమ్ముంటే అభిషేక్ శర్మను ఆడించండి'

**సూర్యకు పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘూ సవాల్!**



టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఆదివారం కొలంబో వేదికగా జరగనున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు ముందు మైండ్ గేమ్స్ మొదలయ్యాయి. పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా, టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు ఓ ఆసక్తికరమైన సవాల్ విసిరారు. టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ గత నమీబియా మ్యాచ్‌కు ముందు కడుపులో నొప్పి కారణంగా దూరమైన సంగతి తెలిసిందే. అయితే పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా మాత్రం అభిషేక్ కోలుకోవాలని, అతను భారత్ తుది జట్టులో ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించాడు. "అభిషేక్ శర్మ రేపటి మ్యాచ్ ఆడాలని నేను కోరుకుంటున్నాను. అతను త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. మేము అత్యుత్తమ ఆటగాళ్లతోనే పోటీ పడాలనుకుంటున్నాము" అని పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా మీడియా సమావేశంలో పేర్కొన్నాడు. గత ఆసియా కప్‌లో పహల్గాం దాడికి నిరసనగా భారత జట్టు పాక్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. ఇది అప్పట్లో పెద్ద వివాదానికి దారితీసింది. దీనిపై స్పందిస్తూ సల్మాన్ ఆఘా.. "రేపటి మ్యాచ్‌లో క్రీడా స్ఫూర్తి కనిపిస్తుందని ఆశిస్తున్నాను" అని వ్యాఖ్యానించాడు. అయితే మరి పాక్ జట్టు షేక్ హ్యాండ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉందా? అని అడగ్గా.. "అది రేపు తెలుస్తుంది" అంటూ దాటవేశాడు. పాక్ బౌలర్ ఉస్మాన్ తారిఖ్ విభిన్నమైన బౌలింగ్ యాక్షన్ ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. అతని బౌలింగ్ యాక్షన్ అక్రమమని వార్తలు వస్తున్న నేపథ్యంలో పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా అతనికి మద్దతుగా నిలిచాడు. "అతని యాక్షన్ ఇప్పటికే రెండుసార్లు క్లియర్ అయ్యింది. మీడియా అనవసరంగా హైప్ చేస్తోంది. యాక్షన్ క్లియర్ అయినప్పుడు ఇక చర్చ ఎందుకు?" అని సల్మాన్ ప్రశ్నించాడు. ఉస్మాన్ తారిఖ్ తన వింత యాక్షన్‌తో భారత బ్యాటర్లను ఇబ్బంది పెడతాడని భావిస్తున్నారు.

## టోర్నీలో బోణీ కొట్టిన ఐర్లాండ్

**ఒమన్‌పై 96 పరుగుల తేడాతో విక్టరీ**



టీ20 వరల్డ్‌కప్‌లో రెండు వరుస ఓటముల తర్వాత ఐర్లాండ్ అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చింది. శనివారం ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 96 పరుగుల తేడాతో నెగ్గి టోర్నీలో బోణీ కొట్టింది. ఐర్లాండ్ నిర్దేశించిన 236 పరుగుల లక్ష్య ఛేదనలో ఒమన్ 18 ఓవర్లలో 139 పరుగుకే కుప్పకూలింది. ఆమిర్ ఖలీమ్ (50 పరుగులు), హమ్మద్ మీర్జా (46 పరుగులు) ఇద్దరే రాణించారు. మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో జోషువా లిటిల్ 3, బ్యారీ మెక్, మ్యాథ్యూ హాంపిర్స్ చెరో 2, జార్జ్ డాక్రెల్ 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. లోర్కన్ టక్కర్ (94 పరుగులు; 51 బంతుల్లో; 10ఇ4, 4ఇ6), డిలానీ (56 పరుగులు; 30 బంతుల్లో; 3ఇ4, 4ఇ6), జార్జ్ డాక్రెల్ (35 పరుగులు, 9 బంతుల్లోనే, 5 సిక్స్?లు) రాణించడంతో భారీ స్కోర్ దక్కింది. ఈ వరల్డ్?కప్ ఎడిషన్?లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ 3, షా ఫైసల్, ఆమిర్ ఖలీమ్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ ఇన్నింగ్స్?తో రాణించిన లోర్కన్?కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇక టీ20ల్లో పరుగుల పరంగా ఐర్లాండ్?కు ఇది మూడో అత్యధిక మార్జిన్ విజయం. 2023లో ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్?లో ఐర్లాండ్? ఏకంగా 128 పరుగుల తేడాతో నెగ్గింది. టీ20 హిస్టరీలో ఆ జట్టుకు బిగ్గెస్ట్ మార్జిన్?తో విజయం సాధించిన మ్యాచ్ ఇదే. దీని తర్వాత 2017లో స్కాట్లాండ్‌తో 98 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇది రెండో అత్యధికం. అలాగే ఈ మ్యాచ్?లో ఇంకో అరుదైన ఘతన నమోదైంది. ఇరుజట్లలోని ఎడమచేతి వాటం బౌలర్లు ఈ మ్యాచ్?లో 11 వికెట్లు పడగొట్టారు. ఒక టీ20 వరల్డ్?కప్? మ్యాచ్?లో ఎడమచేతి వాటం బౌలర్లు అత్యధిక వికెట్లు పడగొట్టిన మ్యాచ్ ఇదే. బంగ్లాదేశ్ జం ఒమన్ మ్యాచ్?తో ఈ మ్యాచ్ నిలిచింది. అది 2021 వరల్డ్‌కప్‌లో జరిగింది.

ఐర్లాండ్ తుది జట్టు : రాస్ అడైర్, టిమ్ టెక్టర్, హ్యారీ టెక్టర్, లోర్కాన్ టక్కర్ (కెప్టెన్, వికెట్ కీపర్), కర్టిస్ కాంఫర్, జార్జ్ డాక్రెల్, గారెత్ డెలానీ, మార్క్ అడైర్, బారీ మెక్కార్తీ, మాథ్యూ హంఫ్రీస్, జాషువా లిటిల్

ఒమన్ తుది జట్టు : అమీర్ కలీం, జతీందర్ సింగ్ (కెప్టెన్), హమ్మద్ మీర్జా, ఆశిష్ ఒడెదర, మహ్మద్ నదీమ్, జితేన్ రామానంది, వినాయక్ శుక్లా (వికెట్ కీపర్), నదీమ్ ఖాన్, సుఫ్యాన్ మహ్మద్, షా ఫైజల్, షకీల్ అహ్మద్

## వరుణ్ చక్రవర్తి వర్సెస్ పాకిస్థాన్..



భారత జట్టు టీ20 ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ విజయాల లక్ష్యంతో శ్రీలంకలో అడుగుపెట్టింది. ఆదివారం పాకిస్థాన్‌తో జరగనున్న మ్యాచ్‌లో అందరి కళ్లు వరుణ్ చక్రవర్తిపైనే ఉన్నాయి. ప్రస్తుతం ఐసీసీ టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నెంబర్-1 స్థానంలో ఉన్న వరుణ్, గత ఏడాది ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌ను చిత్తు చేయడంలో కీలక పాత్ర పోషించి ఈ స్థానాన్ని దక్కించుకున్నాడు. అయితే, 2021లో పాక్‌తో జరిగిన ఒక చేదు జ్ఞాపకం అతడిని ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. 2021 టీ20 ప్రపంచకప్‌లో వరుణ్ చక్రవర్తి తన అరంగేట్రం మ్యాచ్‌ను పాకిస్థాన్‌పైనే ఆడాడు. అప్పట్లో అతడు కేవలం 3 అంతర్జాతీయ మ్యాచ్‌ల అనుభవంతో బరిలోకి దిగాడు. ఆ మ్యాచ్‌లో పాక్ బ్యాటర్లను కట్టడి చేయలేకపోవడమే కాకుండా ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. ఆ సమయంలో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అతడి స్థానం 151. ఆ టోర్నీ తర్వాత అతడి కెరీర్ దాదాపు ముగిసిపోయిందని అంతా అనుకున్నారు. వరుసగా మూడు ఏళ్లు జట్టుకు దూరమై, ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నాడు. కానీ, పట్టుదల వీడకుండా ఐపీఎల్‌లో అదరగొట్టి, 2024లో మళ్లీ టీమ్ ఇండియాలోకి రీ-ఎంట్రీ ఇచ్చాడు. 2024 టీ20 వరల్డ్ కప్ తర్వాత నుంచి వరుణ్ చక్రవర్తి బ్రేకుల్లేకుండా దూసుకుపోతున్నాడు. గడిచిన ఏడాది కాలంలో అంతర్జాతీయ టీ20ల్లో ఏకంగా 61 వికెట్లు పడగొట్టి రికార్డు సృష్టించాడు. ఇందులో విశేషం ఏంటంటే.. ఈ 61 వికెట్లలో 48 వికెట్లు కేవలం తన గుగ్లీ బంతులతోనే సాధించాడు. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో (7 నుంచి 16 ఓవర్ల మధ్య) వరుణ్ బౌలింగ్‌ను ఎదుర్కోవడం పాక్ బ్యాటర్లకు హిమాలయాలను ఎక్కడం లాంటిదే. ప్రస్తుతం అతడి ఎకానమీ 7.30 మాత్రమే ఉండటం, బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టే అతడి మిస్టరీ బౌలింగ్ ఈసారి పాక్‌కు పెను ముప్పుగా మారనుంది. గతంలో తన కెరీర్‌ను ప్రమాదంలో పడేసిన పాకిస్థాన్ జట్టుపై ఈసారి అదే స్థాయిలో విరుచుకుపడాలని వరుణ్ సిద్ధమయ్యాడు.

ఆసియా కప్‌లో ఇప్పటికే పాకిస్థాన్‌ను ఓడించి తన సత్తా చాటిన వరుణ్, ఇప్పుడు వరల్డ్ కప్ వేదికగా దాయాది జట్టును మట్టికరిపిం చాలని చూస్తున్నాడు. కొలంబోలోని ప్రేమదాస పిచ్ స్పిన్నర్లకు స్వర్గధామం కావడంతో, వరుణ్ చక్రవర్తి మ్యాజిక్ బంతులకు పాక్ ఆటగాళ్లు వికెట్లు పారేసుకోవడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఏప్రిల్ 1న పెళ్లి నిజమే

## ర్యూమర్స్‌పై చమత్కరించిన మృణాళ్ ఠాకూర్


సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాల్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాల్ గతంలో 'మేము కేవలం మంచి స్నేహితులమే' అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు. ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ ఠాకూర్‌ను ఈ విషయంపై ప్రశ్నించారు. ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?' అని అడగగా మృణాల్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. ఫిబ్రవరి 14 కాదు ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!' అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ, 'ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు 'మృణాల్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇది నిజంగా భయంకరంగా ఉంది' అని చెప్పింది. ఇలా క్లియర్ క్లారిటీ ద్వారా ధనుష్‌తో పెళ్లి వార్తలకు మృణాల్ పూర్తిగా చెక్ పెట్టినట్టే అయ్యింది.



# అట్లీ-అల్లు అర్జున్ మూవీ

## సినిమా షూటింగ్ డిలేపై అల్లు అసహనం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్ తో చేస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా గురించి ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెత్‌తో హాలీవుడ్ రేంజ్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజువల్ వండర్‌గా, హైఎండ్ గ్రాఫిక్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. అందుకే ఈ సినిమాకు సంబంధించిన చిన్న న్యూస్ అయినా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఈ సినిమా విడుదల తర్వాత ఇండియన్ సినిమా మేకింగ్ స్టైల్‌లో కొత్త ట్రెండ్ సెట్ అవుతుందని భావిస్తున్నారు. లార్జ్ స్కేల్ ప్రాజెక్ట్స్‌కు ఈ సినిమా ఫౌండేషన్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుందనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై మరో టాక్ ఇండస్ట్రీల్రో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే? సినిమా షూటింగ్ అనుకున్న దానికంటే నెమ్మదిగా సాగుతుండటంతో అల్లు అర్జున్ అసంతృప్తిగా ఉన్నాడని గాసిప్స్ వినిపిస్తున్నాయి. ఎ÷-లాన్ చేసిన రిలీజ్ డేట్‌కు సినిమా పూర్తి అవుతుందా లేదా అన్న ఆందోళన కూడా బన్నీకి ఉన్నట్లు టాక్. ఈ నేపథ్యంలో మేకర్స్‌తో మాట్లాడి, మేకింగ్‌ను మరింత పక్కాగా ప్లాన్ చేసి షూటింగ్ వేగవంతం చేయాలని సూచించినట్టు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ న్యూస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ మరో తమిళ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తో కూడా సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో ఫ్యాన్స్‌లో మరింత ఎగ్జైట్మెంట్ పెరిగింది. ఆ సినిమా కూడా భారీ పాన్ ఇండియా లెవల్‌లో తెరకెక్కనుందని టాక్ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే, అట్లీ – అల్లు అర్జున్ కాంబినేషన్ మూవీ 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు ప్రాజెక్ట్స్ పూర్తయ్యే సరికి అల్లు అర్జున్ రేంజ్ గ్లోబల్ లెవల్‌కు వెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ భారీ సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# రోషన్ హీరోగా ఏమో ఏమో ఇది మూవీ



ఛాంపియన్ హీరో రోషన్ మేక టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే క్లాసిక్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. వాలెంటైన్స్ డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్‌తో పాటు 'ద ఫస్ట్ బ్రీజ్' పేరుతో ఒక చిన్న గ్లింప్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇప్పటివరకు 'హిట్' సిరీస్, 'సైంధవ్' వంటి ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్లతో మెప్పించిన శైలేష్ కొలను, ఈసారి పూర్తి భిన్నంగా రొమాంటిక్ కామెడీ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. ఈ గ్లింప్స్‌లో హీరో రోషన్ (అభయ్) తన తల్లితో అమ్మాయిల గురించి, నేటి తరం రిలేషన్ షిప్స్ గురించి చేసే కామెడీ సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రోషన్ సరసన 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ (అపూర్వ పాత్రలో) కథానాయికగా నటిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన హేషామ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 దసరా కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

# ఘట్టమనేని మరో వారసుడు జయకృష్ణ ఎంట్రీ

## శ్రీనివాస మంగాపురం మూవీ పోస్టర్ విడుదల

వాలంటైన్స్ డే సందర్భంగా తెలుగు సినీ ప్రియులకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం నేడు విడుదల చేసింది. విడుదలైన పోస్టర్‌లో 'ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని' అంటూ కథానాయకుడు శ్రీను మంగతో చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుండడంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతుంది. ఇక ఈ సినిమాకు ఆర్ ఎక్స్ 100, మంగళవారం చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా మరియు ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ వంటి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.





# గ్లామర్ తో మతులు పోగోడుతున్న సుందరవల్లి!

సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ఎంతోమంది సెలబ్రిటీలు పాపులారిటీని సంపాదించుకోవడమే కాకుండా.. తమ సినిమాలను కూడా ప్రమోట్ చేసుకుంటున్నారు. అందులో భాగంగానే అందాలు ఆరబోస్తూ తమ పాత్రలను రివీల్ చేస్తూ తమ సినిమాలకు వస్తున్న రెస్పాన్స్ కి.. ఆడియన్స్ కి కృతజ్ఞతలు కూడా తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే ఒక హీరోయిన్ తన పాత్ర పేరుతో అభిమానులకు కృతజ్ఞతలు చెప్పుకొచ్చింది. తన సినిమా టీజర్ కి ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు మంత్రముగ్ధులైన ఆమె.. ఈ వాలెంటైన్స్ డే సందర్భంగా స్పెషల్ ఫోటోలతో పాటు స్పెషల్ గా ధన్యవాదాలు కూడా తెలియజేయడం ఇప్పుడు వైరల్ గా మారింది. ఆమె ఎవరో కాదు ప్రముఖ యంగ్ బ్యూటీ నభా నటేష్. తాజాగా ఈమె నిఖిల్ సిద్ధార్థ ఃస్వయంభుః సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాలో సుందరవల్లి పాత్రలో నటిస్తున్నట్లు ఈమె ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా మేకర్స్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. భరత్ కృష్ణమాచార్య దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో నభా నటేష్ తో పాటు సంయుక్త మీనన్ కూడా నటిస్తోంది. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఈ సినిమా టీజర్ ని మేకర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ టీజర్ కి విశేష స్పందన లభిస్తున్న నేపథ్యంలో పైగా ఈరోజు వాలెంటైన్స్ డే సందర్భంగా కొన్ని ఫోటోలను షేర్ చేస్తూ మీ సుందరవల్లి వాలెంటైన్స్ డే సందర్భంగా మీకు స్పెషల్ విషెస్ తెలియజేస్తోంది. స్వయంభు టీజర్ కి అందించిన ఆదరణకు ధన్యవాదాలు అంటూ తెలియజేసింది. ఇకపోతే తాజాగా సుందరవల్లి గెటప్ లో తన అందంతో మరోసారి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. గ్రీన్ అండ్ రెడ్ కలర్ లెహంగా ధరించి టాప్ స్లీవ్ లెస్ అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది. గ్లామర్ విందు వడ్డిస్తూ యువతకు ఊపిరాడకుండా చేసింది ఈ ముద్దుగుమ్మ. మొత్తానికైతే వాలెంటైన్స్ డే సందర్భంగా నభా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

# శివరాత్రి రుద్రుడికి ప్రీతకరం

## ఉపవాసంతో స్వామికి అర్చన మంచిది

శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహా శివరాత్రి. హిందువులు పెద్ద పండుగల్లో శివరాత్రి ఒకటి. పార్వతీదేవిని శివుడు పెళ్లాడిన రోజునే ఈ పండుగగా జరుపుకుంటారు. అలాగే శివపురాణంలో మహాశివరాత్రికి సంబంధించి ఇంకొన్ని కథలు కూడా ఉన్నాయి. మాఘమాసంలోని కృష్ణ పక్ష చతుర్దశి రోజున మహా శివరాత్రి వస్తుంది. ఈ రోజున శివుడిని భక్తి, పూజలతో కొలిస్తే అంతా మంచి జరుగుతుందని నమ్ముతారు. ఈ ఏడాది అలాంటి పవిత్రమైన రోజు ఫిబ్రవరి 15న వచ్చింది. దేశమంతటా శివాలయాల్లో పెద్ద ఎత్తున శివరాత్రి సంబరాలు జరుగుతుంటాయి. శివరాత్రి అనగానే అందరికీ వెంటనే గుర్తొచ్చేది. ఉపవాసం, జాగరణ. ఈ రోజున ఉపవాసం ఉండి, రాత్రి జాగరణ చేస్తే పుణ్యం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. శివరాత్రి నాడు తెల్లవారుజామునే లేచి, స్నానం చేసి ఆ తర్వాత శివరాత్రి వ్రతాన్ని మొదలుపెట్టాలి. ఈ వ్రతం చేసేటప్పుడు ఉపవాసం, జాగరణం, బ్రహ్మచర్యం అనే నియమాలు పాటించాలి. ఇంట్లోనే గానీ, ఆలయంలోగానీ వ్రతాన్ని ఆచరించవచ్చు. రాత్రంతా జాగరణం ఉండి, ఉదయాన్నే స్నానం చేశాక మళ్లీ పూజ చేసి వ్రతాన్ని విడవాలి. అన్నం లాంటి రోజూ తీసుకునే ప్రధాన ఆహారం కాకుండా పాలు, పండ్లు మాత్రమే, అదీ సాయంత్రం పూటనే తీసుకోవాలి. ఇతరులతో దైవ సంబంధమైన మాటలనే ఎక్కువగా మాట్లాడితే మంచిది. ఓం నమః శివాయ మంత్రాన్ని జపిస్తూ ఉండాలి. అనారోగ్యంతో ఉన్నప్పుడు ఉపవాసం ఉండకండి. మహా శివరాత్రి నాడు భక్తులు ఉపవాస దీక్షను పాటిస్తారు. చాలామంది కఠినంగా ఉండి.. కనీసం నీరు కూడా తాగరు. దీనిని నిర్జల ఉపవాసం అంటారు. కొంతమంది పాలు పండ్లు లాంటి సాత్విక ఆహారం తీసుకుంటారు. ప్రస్తుతం జీవన ప్రమాణాల దృష్ట్యా పెరుగు, మజ్జిగ, కొబ్బరి నీరు డ్రై ఫ్రూట్స్ వంటివి కూడా తినవచ్చు. శివరాత్రి మరుసటి రోజు సూర్యోదయం అయిన తరువాత ఉపవాస దీక్షను విరమించాలి. మహాశివరాత్రి ఉపవాస సమయంలో కొన్ని ఆహారాలను ఖచ్చితంగా తినకూడదు. వీటిలో గోధుమలు, బియ్యం, పప్పులు మరియు పప్పుధాన్యాలు వంటి ధాన్యాలు ఉన్నాయి. ఉల్లిపాయలు, వెల్లుల్లి , ఉడికిన పదార్ధాలను తినకూడదు. ఇంకా వీటితో పాటుగా మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలని పండితులు చెబుతున్నారు. శివరాత్రికి చేసే జాగరణ మనలో ఉన్న శివత్వాన్ని జాగృతం చేస్తుంది. జాగరణం మనలో ఉన్న శివుడిని జాగృతం చేస్తుంది, తమస్సును తొలగిస్తుంది.



సినిమాలు చూస్తునో, పిచ్చి కబుర్లు చెప్పుకుంటూనో, కాలక్షేపం చేస్తూనో చేసే జాగరణకు అది జాగరణ అవ్వదు, కాలక్షేపం మాత్రమే అవుతుంది. అప్పుడు పుణ్యం రాకపోగా, ఆ సమయంలో మట్లాడిన చెడు మాటల వలన పాపం వస్తుంది. శివరాత్రి మరునాడు ఉదయం శివాలయాన్నిసందర్శించి, ప్రసాదం తీసుకుని, ఇంటికి వచ్చి భోజనం చేసి ఉపవాస వ్రతం ముగించాలి. అందరూ గుర్తుపెట్టుకోవలసిన ముఖ్య విషయం, శివరాత్రి నాడు ఉపవాసం, జాగరణ చేసినవారు, తరువాత రోజు రాత్రి వరకు నిద్రించకూడదు. అప్పుడే సంపూర్ణఫలం దక్కుతుందని చెప్తారు.

# శ్రీశైలంలో వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

## పుష్పపల్లకిపై దర్శనమిచ్చిన మల్లికార్జునుడు

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వైభవంగా జరుగుతున్నాయి. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి అమ్మవారు పుష్పపల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పపల్లకిలో శ్రీస్వామి అమ్మవారికి అర్చకులు వేదపండితులు ఆలయ చైర్మన్, సభ్యులు,ఈవో శ్రీనివాసరావు ప్రత్యేకపూజలు నిర్వహించి హారతులిచ్చారు. విద్యుత్ దీపకాంతుల నడుమ శ్రీశైలం పురవీధులలో శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్సవానికి తరలుతుండగా... ఉత్సవం ముందు కోలాటాలు డమరక నాధాలతో పలు రకాల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం ఎదుట పలు రకాల పుష్పాలతో దేదీప్యమానంగా సర్వాంగ సుందరంగా తయారుచేసిన పుష్పపల్లకిలో శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్సవంలో భక్తులను కనువిందు చేశారు గంగాధర మండపం దగ్గర పుష్పపల్లకిలో ఉన్న శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక హారతులిచ్చి అనంతరం అంకాలమ్మ గుడి,నంది మండపం బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవం కన్నులపండువగా సాగింది. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు పుష్పపల్లకిపై ఉన్న శ్రీస్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలర్పించారు శ్రీశైల క్షేత్రమంత శివనామస్మరణతో మారుమ్రోగింది....



# ప్రదోష కాలమే పరమశివుడికి ప్రీతికరం

## ఆ సమయంలోనే పూజలు చేస్తే మంచిది

తిథులలో త్రయోదశి, చతుర్దశి చాలా ప్రత్యేకమైనవి. శివరాత్రికి సంబంధించినంత వరకు 'ప్రదోష' కాలం చాలా ముఖ్యం. అంటే రాత్రి కాలం అని అర్థం. రాత్రి వేళ ప్రదోషంతో ప్రారంభమవుతుంది. అంటే... సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల మధ్య సమయం అన్నమాట. ఈ సమయంలో పరమేశ్వరుడిని పూజించినా, శివ పంచాక్షరీ ధ్యానం చేసినా మానసిక ప్రశాంతత లభిస్తుంది. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఇక, త్రయోదశికి మన్మథుడు, చతుర్దశికి కలి పురుషుడు అధిపతులు. వీరిరువురినీ నియంత్రించే శక్తి ఒక్క పరమేశ్వరుడికే ఉంది. అలాగే బుధ, గురువారాలు బుద్ధికీ, మాటకీ సంకేతం గనక... రోజూ కాకపోయినా ఈ రోజుల్లో, ఆ తిథుల్లో ప్రదోషకాలంలో శివారాధన చేయాలని చెబుతారు. 'ఓం నమః శివాయ' అని స్మరిస్తే చాలు కరిగిపోతాడు



పరమశివుడు. భక్తితో ఓ సుమం సమర్పించినా సంతుష్టుడవుతారు. ఇక స్వామికెంతో ప్రీతి కరమైన ప్రదోష కాలంలో పూజిస్తే విశేష ఫలితాలు ఉంటాయి. ప్రదోషమంటే పాప నిర్మూలన. తెలిసీ తెలీక చేసే పాపకర్మల వల్ల ప్రతిబంధకాలను కొని తెచ్చుకున్నట్లవుతుంది. దాంతో పురోభివృద్ధికి ఉన్న అవకాశాలు పరిమితమౌతాయి. ఆ పాపకర్మలు నిర్జీవం కావాలంటే, దానికి తగ్గ పుణ్యకర్మలు చేయాలి. పరమశివుడు ప్రమథ గణాలతో కొలువయ్యుండే ప్రదోషకాలంలో శివుని స్మరిస్తే మన పాప కర్మల ఫలాన్ని తాను స్వీకరించి కష్టాలను తొలగిస్తాడనేది భక్తుల నమ్మకం. అందుకే ఉపవాసంత తరావత ప్రదోష కాలంలో అభిషేకాలు చేయాలి.



# లోకోత్తరం... నటరాజ స్వరూపం

ఆనందతాండవ స్వరూపం పరమేశ్వరుడి సృష్టి, స్థితి, సంహారం, తిరోధానం, అనుగ్రహాలనే పంచకృత్యాలకు ప్రతీక. పరమేశ్వరుని లారూపాలలో నటరాజస్వామి అత్యంత ప్రసిద్ధి చెందిన రూపం. కైలాసంలో పార్వతీదేవితో కలిసి పరమేశ్వరుడు ప్రదర్శించే నృత్యానికి 'తాండవం' అని, పార్వతీదేవి ప్రదర్శించే నృత్యానికి 'లాస్యం' అని పేరు. శివతాండవం గంభీరంగా ఉంటే, పార్వతీదేవి ప్రదర్శించే లాస్యం మృదువుగా, సౌకుమార్యంతో కూడి మనోహరంగా ఉంటుంది. సందర్భానుసారంగా తాండవాన్ని, నృత్యాన్ని అనేక పేర్లతో పిలుస్తారు. శివుడు మహదానందంతో చేసే నృత్యాన్ని 'ఆనందతాండవం' అనీ, ప్రదోషవేళలో (సాయంత్రవేళ) చేసే నృత్యాన్ని 'సంధ్యాతాండవం' అనీ, గౌరీదేవితో చేసే నృత్యాన్ని 'గౌరీతాండవం' అనీ, కాళికాదేవితో చేసే నృత్యాన్ని 'కాళికాతాండవం' అనీ, త్రిపురాసుర సంహార సమయంలో చేసిన నృత్యాన్ని 'త్రిపురతాండవం' అని, దుష్టశిక్షణ సమయంలో చేసే నృత్యాన్ని 'సంహారతాండవం' అనీ, ఉమాదేవితోకూడి పరమ లాలిత్యంగా, ఉల్లాసంగా చేసే నృత్యాన్ని 'ఉమాతాండవం' అనీ అంటారు. ఇవేకాదు... శివుని నృత్యరూపాలు అనేకం. అవి '108 కరణాలు'గా ప్రసిద్ధి చెందాయి. చిదంబరం నటరాజస్వామి ఆలయం గోపుర ద్వారాలకు ఇరువైపులా, తంజావూరులోని బృహదీశ్వరాలయం విమానగోపురంపైనా ఈ తాండవ శిల్పాలు దర్శనమిస్తాయి.

ఆనందతాండవం: స్వామి తన ఎడమకాలిని తన కుడికాలిపై అడ్డంగా నిలిపి, కుడికాలును కొంచెం పక్కకు వంచి నిలబడతారు. ఎడమవైపు శరీరాన్ని కాస్త కుడివైపు తిప్పి, ఎడమ చేతిని కుడివైపు బారుగా చాపుతారు. ఎడమ హస్తాన్ని కిందకు వదిలి... లోకాలన్నిటినీ ఆశీర్వదిస్తున్నట్టుగా కుడిచేతిని అభయముద్రగా ఎడమచేతిపై ఉంచుతారు. అలాగే తన పర (వెనుక) హస్తాలలోని కుడిచేతిలో ఢమరుకం, ఎడమచేతిలో అగ్ని ధరించి ఉంటారు. ప్రసన్నమైన చూపులతో, నర్మగర్భమైన చిరునవ్వులతో నిండిన, శాంతభావం ఉట్టిపడే ముఖంతో.. చుట్టూ ప్రజ్వలిస్తున్న అగ్ని శిఖలతో నిండిన 'ప్రభావళి' అనే మకరతోరణం మధ్యలో ఆనందంగా నాట్యమాడుతూ దర్శనమిస్తారు. చరాచరజగత్తును లయం చేసుకోగలిగే ఆ స్వామి ఆశ్చర్యం కలిగించేలా ఒక షట్కోణంలో అమరిపోయి ఉంటారు. దీనికే 'ఆనందతాండవమూర్తి' అని పేరు. ఈ రూపంలో శివుడు ధరించిన ఆయుధాలనుబట్టి హస్త, పాదముద్రలు ఆయన పంచకృత్యాలను సూచిస్తాయి. ఢమరుకం సృష్టికి, కుడిచేతి అభయముద్ర స్థితికి, పరహస్తాలలోని అగ్ని సంహారానికి, పద్మపీఠం మీద మోపిన కుడిపాదం తిరోధానానికి, గాలిలోకి లేపి ఉంచిన ఎడమపాదం అనుగ్రహానికి ప్రతీకలు.

అపస్మారుడు: శివుడి పాదాలకింద అణిగి ఉన్న ఒక పొట్టి భూతానికి 'అపస్మారుడు' అని పేరు. ఇతడు చతుస్తాళంలో, మరుగుజ్జురూపంలో... నటరాజు కుడిపాదం కింద బోర్లా పడుకొని, కుడిచేత్తో కత్తిని ఎడమచేతితో పామును పట్టుకొని ఉంటాడు. ఈ భూతం తల నటరాజస్వామి వారి కుడివైపు తిరిగి ఉంటుంది.

శిరోలంకారం: నటరాజస్వామి శిరస్సు కొంగ ఈకలను పూలగుత్తి మాదిరిగా వరుసగా అమర్చినట్టు అలంకరించి ఉంటుంది. అలాగే ఒక పాము, ఉమ్మెత్త, జిల్లేడు తదితర పుష్పాలతో... మధ్యలో ఒక పుర్రె, తలకు కుడిపక్కన చంద్రవంక ఉంటాయి. మిగిలిన కేశాలు జడలుగా, ఆయన వేగవంతమైన నృత్యరీతులకు అనుగుణంగా, వదులుగా గాలిలో ఎగురుతున్న జటాజూటంగా అమరి ఉంటుంది. స్వామివారి కుడివైపు జడల మధ్యలో గంగాదేవి ఉంటుంది. పైభాగం స్త్రీరూపంలో, కిందిభాగం చేపలా విలక్షణంగా కరండ మకుటంతో, అంజలిముద్రతో ఉంటుంది.

ఆభరణాలు: ఆనందతాండవమూర్తి తన కంఠంలో వివిధ హారాలు, భుజం పైనుంచి యజ్ఞోపవీతం, ఎడమచెవికి తాటంకం, కుడిచెవికి మకరకుండలం, చేతికి కంకణాలు, భుజాలకు కటక వలయాలు, పాదాలకు పాదసరాలు, కుడిచేతికి వీరకంకణం, కాలివేళ్ళకు పాద అంగుళీయకాలు, చేతివేళ్ళకు ఉంగరాలు ధరించి ఉంటారు. స్వామి పొట్ట చుట్టూ ఉండే ఉదరబంధం... ఆయన చుట్టూ ఉన్న మకరతోరణానికి ఆనుకునేటట్టు ఉంటుంది.

భుజంగవలయం: విలాసంగా నృత్యం చేస్తున్న స్వామి చెంత అంతే వయ్యారంగా పడగవిప్పి ఆడుతున్నట్టు ఉండే పాముల వరసలను 'భుజంగ వలయం' అంటారు. ఆ మూర్తికి వస్త్రంగా నడుముచుట్టూ పులితోలు ఉంటుంది.

ప్రభావళి: ఈ ప్రభావళి గుండ్రంగా లేదా అండాకారంలో ఉంటుంది. పీఠం దగ్గర ఉన్న మకరాల నోటి నుంచి బయటికి వస్తున్నట్టు ఉంటుంది. దాని చుట్టూ అగ్నిశిఖలు వరుసగా మండుతున్నట్టు... సూర్యుడికి ప్రతీకగా అమరి ఉంటుంది. ప్రభావళి మీద ప్రకృతికి ప్రతీకగా లతలు, పద్మాలు ఉంటాయి. సూర్యుడు తన తేజస్సు ద్వారా ప్రపంచాన్ని స్వాధీన పరచుకొని సృష్టిని నడుపుతున్నట్టు... ఈ ప్రభావళిలోని నటరాజస్వామి పంచకృత్యాలు నడుపుతున్నాడనే సూచికగా ఈ ప్రతిమ ఉంటుంది.

శివకామసుందరి: ఆనందతాండవమూర్తి రూపాన్ని విస్మయంతో చూస్తున్నట్టు... స్వామికి ఎడమ పక్కన సంభ్రమంతో నిండిన పార్వతీదేవి... కుడిచేతితో నీలోత్పలం పట్టుకొని, ఎడమచేతిని డోలాహస్తంగా కిందికి వదిలి, కరండ మకుటం లేదా జటామకుటంతో కూడిన భంగిమలో... 'శివకామసుందరి'గా నిలబడి ఉంటుంది.

ఆభాసభంగం: నిలబడిన భంగిమలో ఉండే విగ్రహాలు శిల్పశాస్త్రాలలోని భంగ లక్షణం ప్రకారం 'అభంగం, సమభంగం, అతిభంగం' అనే మూడు విధాలుగా ఉంటాయి. నాట్యపద్ధతిలో ఉన్న విగ్రహాలకు 'ఆభాసభంగ విగ్రహాల'ని పేరు. నటరాజస్వామి ఆనందతాండవ రూపం... ఆభాసభంగ ప్రతిమలకు గొప్ప ఉదాహరణ. తాళమానాన్ని అనుసరించి ఈ మూర్తిని ఉత్తమ దశతాళ విగ్రహ ప్రమాణంలో కానీ, మధ్యమ దశతాళ ప్రమాణంలో కానీ తయారు చేయాలి.

# మేయర్ పీఠం కోసం హైటెన్షన్ రాజకీయాలు





### సీఎం ఆదేశాలతో కాంగ్రెస్ శిబిరం కసరత్తు

### బీఆర్ఎస్ మద్దతు, ఇండిపెండెంట్లపై ఫోకస్

### రంగంలోకి మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు







కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో రాజకీయ సమీకరణాలకు దిగింది. స్పష్టమైన మెజారిటీ ఏ పార్టీకి రాకపోవడంతో నగర రాజకీయాలు ఒక్కసారిగా ఉత్కంఠభరితంగా మారాయి. మొత్తం 66 డివిజన్లలో బీజేపీ 30 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచింది. కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 9, ఎంఐఎం 3 స్థానాలు గెలుచుకోగా ఇండిపెండెంట్లు కీలకంగా మారారు. మేయర్ ఎన్నికకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ చుట్టూ అన్ని పార్టీలూ లెక్కలు వేస్తున్నాయి.

మేయర్ పీఠాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ వేగంగా కదిలింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిస్థితిని ఛాలెంజింగ్‌గా తీసుకుని సమీకరణాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. చివరి నిమిషం వరకు మద్దతులను కూడగట్టేందుకు పార్టీ నాయకత్వం వ్యూహాలు అమలు చేస్తోంది.

సంఖ్యాబలం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యర్థి అయిన బీఆర్ఎస్‌తో సహకారం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధికారాన్ని దక్కించుకోవడానికి బీఆర్ఎస్ మద్దతు కీలకమని భావిస్తున్న కాంగ్రెస్ నేతలు ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇక ఇండిపెండెంట్ల పాత్ర మరింత కీలకంగా మారింది. బీజేపీ శిబిరంలో చేరికలతో ఆ పార్టీ సంఖ్యాబలం 35కు చేరినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మిగిలిన ఇండిపెండెంట్లను తమవైపు తిప్పుకుంటే కాంగ్రెస్ (14), ఎంఐఎం (03), బీఆర్ఎస్ (09) కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు (2) కలిపి 34కు చేరుకుంటుందని కాంగ్రెస్ వర్గాలు లెక్కలు వేస్తున్నాయి. వీరైతే ఇప్పటికే బీజేపీ శిబిరంలోకి వెళ్లిన ఇండిపెండెంట్లను కూడా తిరిగి తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. మద్దతు సమీకరణం కోసం పలు దిశల్లో చర్చలు కొనసాగుతున్నాయని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

దీనికోసం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న కార్పొరేటర్లను క్యాంపులకు తరలించినట్లు సమాచారం. అందుబాటులో ఉన్న వారిని ఒకేచోట ఉంచి తదుపరి వ్యూహంపై చర్చలు సాగుతున్నాయి. ఇతర పార్టీలూ తమ కార్పొరేటర్లను కాపాడుకునే చర్యలు తీసుకుంటుండటంతో నగరంలో క్యాంపు రాజకీయాలు చర్చనీయాంశంగా మారాయి. ఎంఐఎం మద్దతు అంశం కూడా కీలకంగా మారే అవకాశముందని అంచనా. అధికార పార్టీతో కలిసి పనిచేసే అవకాశాలపై చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం ఉన్నప్పటికీ అధికారిక ప్రకటనలు వెలువడలేదు.

మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కరీంనగర్ రాజకీయాల్లో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. చివరి నిమిషం వరకు సమీకరణాలు మారే అవకాశముండటంతో అన్ని పార్టీలూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. సంఖ్యాబలం ఎవరికి అనుకూలంగా మారుతుందో అన్న ఆసక్తి నెలకొంది.

నగరపాలనపై ఆధిపత్యం కోసం జరుగుతున్న ఈ పోరు కరీంనగర్ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## అధికార దుర్వినియోగంతో కాంగ్రెస్ గెలుపు

### హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి

హుస్నాబాద్,జనత న్యూస్: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికార బలాన్ని ప్రయోగించి అనైతికంగా విజయం సాధించిందని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి విమర్శించారు. శనివారం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నిజంగా ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచామని నమ్మితే, మంత్రి పొన్నం ప్రభాకర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి ఎన్నికల్లో గెలిచి తన నైతికతను చాటుకోవాలని సవాల్ విసిరారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, బెదిరింపులకు పాల్పడితే బీఆర్ఎస్ పార్టీ భయపడబోదని ఆయన స్పష్టం చేశారు.

హుస్నాబాద్ పట్టణ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మల్లికార్జున రెడ్డి ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం వల్లే కొన్ని వార్డుల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నాయకత్వం అధైర్యపడకుండా భవిష్యత్తులో ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన హామీలను అమలు చేయకపోతే ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



## మేయర్ పీఠం దిశగా కమలం దూకుడు

### సంఖ్యాబలం పెంచుకుంటూ బీజేపీ ముందంజ

### సోమవారం వరకు మారే సమీకరణాలు... కాంగ్రెస్ కౌంటర్ ప్రయత్నాలు



కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికకు ముందు నగర రాజకీయాలు ఉత్కంఠభరితంగా మారాయి. ఎన్నికల ఫలితాల్లో అతిపెద్ద పార్టీగా నిలిచిన భారతీయ జనతా పార్టీ సంఖ్యాబలం పెంచుకుంటూ మేయర్ పీఠం వైపు దూసుకుపోతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే సోమవారం జరిగే మేయర్ ఎన్నిక వరకు సమీకరణాలు మారే అవకాశముండటంతో అన్ని పార్టీలూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.

### ఫలితాల్లో బీజేపీ ఆధిక్యం

**మొత్తం 66 డివిజన్లలో వెలువడిన ఫలితాల ప్రకారం:**

**బీజేపీ -- 30**
**కాంగ్రెస్ -- 16**
**బీఆర్ఎస్ -- 9**
**ఎంఐఎం -- 3**
**ఇండిపెండెంట్లు -- 6**
**ఫార్వర్డ్ బ్లాక్ -- 2**

ఈ లెక్కల ప్రకారం బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. కార్పొరేషన్‌లో ఎక్స్ అఫీషియో సభ్యులను కలుపుకుంటే మొత్తం ఓటింగ్ సభ్యుల సంఖ్య పెరుగుతుండగా, మేయర్ ఎన్నికకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ సుమారు 35గా ఉండే అవకాశముంది.

### చేరికలతో పెరుగుతున్న కమలం బలం

ఎన్నికల ఫలితాల అనంతరం కొంతమంది ఇండిపెండెంట్ కార్పొరేటర్లు బీజేపీకి మద్దతు ప్రకటించినట్లు సమాచారం. రెండు నుండి నాలుగు ఇండిపెండెంట్ల చేరికలతో బీజేపీ సంఖ్యాబలం 33–34 మధ్యకు చేరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎక్స్ అఫీషియో సభ్యుల మద్దతు కలిస్తే బీజేపీ బలం మ్యాజిక్ ఫిగర్‌కు సమీపించిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇంకా మరో కొందరు ఇండిపెండెంట్లు, చిన్నపార్టీల కార్పొరేటర్లు కూడా బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఈ చేరికలు కొనసాగితే మేయర్ ఎన్నిక నాటికి బీజేపీ స్పష్టమైన ఆధిక్యం సాధించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### బీజేపీ వ్యూహాత్మక దూకుడు

బీజేపీ శిబిరంలో మాత్రం పూర్తి స్థాయి నమ్మకం వ్యక్తమవుతోంది. ఎన్నికల ఫలితాల్లో ముందంజలో నిలవడం, తరువాతి చేరికలు, ఎక్స్ అఫీషియో సభ్యుల మద్దతు---ఖశ్రీశ్రీ కలిపి మేయర్ పీఠం దిశగా అనుకూల వాతావరణం ఏర్పడిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

నగర అభివృద్ధి కోసం కేంద్ర నిధులు తీసుకురావడం, కార్పొరేషన్‌లో పాలన చేపట్టే సామర్థ్యం ఉందని చెబుతూ బీజేపీ నేతలు తమ సంఖ్యాబలం కాపాడుకునే దిశగా చర్యలు చేపట్టినట్లు సమాచారం.

### కాంగ్రెస్ కౌంటర్ సమీకరణాలు

మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీ కూడా వెనుకడుగు వేయకుండా సమీకరణాలపై దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు రంగంలోకి దిగినట్లు సమాచారం. బీఆర్ఎస్, ఎంఐఎం, ఇండిపెండెంట్ల మద్దతుతో మ్యాజిక్ ఫిగర్ చేరుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న కార్పొరేటర్లను ఒకేచోట ఉంచి వ్యూహాలు రచిస్తున్నట్లు ప్రచారం ఉంది. బీజేపీ శిబిరంలో ఉన్న కొందరిని తిరిగి తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

### నిర్ణయాత్మకంగా ఇండిపెండెంట్లు

ఈ ఎన్నికలో ఇండిపెండెంట్లు, చిన్నపార్టీల కార్పొరేటర్లు కీలకంగా మారారు. ఎవరి వైపు ఎక్కువగా మొగ్గుతారన్నదే మేయర్ ఫలితాన్ని నిర్ణయించే అంశంగా మారింది. బీఆర్ఎస్, ఎంఐఎం పాత్ర కూడా చివరి నిమిషంలో కీలకంగా మారే అవకాశముంది.

### సోమవారం వరకు ఉత్కంఠ

మేయర్ ఎన్నిక సోమవారం జరగనుండగా అప్పటి వరకు రాజకీయ సమీకరణాలు మారే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే ప్రస్తుత లెక్కల ప్రకారం బీజేపీ ముందంజలో ఉండగా, కాంగ్రెస్ కూడా చివరి నిమిషం వరకు పోరాటం కొనసాగించే అవకాశముంది. కరీంనగర్ కార్పొరేషన్‌లో మేయర్ పీఠం ఎవరి దక్కుతుందన్నది ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. సోమవారం జరిగే ఎన్నికతో నగర పాలనా దిశ నిర్ణయంకానుంది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com